# లడ్డూ @ రూ.39 లక్షలు

**బడంగ్ పేట్,ఫ్లాష్ ఇండియా :** ప్రపంచ ప్రసిద్ధిగాంచిన బాలాపూర్ గణనాథుడి లడ్డూను దక్కించుకునేందుకు ప్రతి ఏడాది భక్తుల్లో తీవ్ర పోటీ నెలకొంటోంది. లడ్డూ వేలం పాటలో కొత్త రికార్డులు నమోదవుతూ బాలాపూర్ లడ్డూ ప్రత్యేకత ఏటేటా మరింత పెరుగుతోంది. ప్రారంభమైన నాటి నుంచి వేలం పాటలో తన రికార్డును తానే అధిగమిస్తూ బాలాపూర్ గణనాథుడు ముందుకు సాగుతున్నాడు. 1994 లో కేవలం 450 రూపాయల తో ప్రారంభమైన బాలాపూర్ లడ్డూ వేలం, అంచెలంచెలుగా పెరుగుతూ నేడు దేశవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు పొందింది.ప్రతి సంవత్సరం వేలం ధర పెరుగుతుండటంతో బాలాపూర్ లడ్డూ వేలం పాట పై ప్రజల్లో ఆసక్తి మరింత పెరుగుతోంది. బాలాపూర్ లడ్డూను దక్కించుకుంటే అదృష్టం, ఐశ్వర్యం కలుగుతాయని భక్తుల్లో ఉన్న విశ్వాసం వేలం పాటలో పోటీకి ప్రధాన కారణంగా నిలుస్తోంది. దీంతో ప్రతి ఏడాది వేలం పాట ఉత్కంఠభరితంగా సాగుతుంది."లడ్డూ అంటే బాలాపూర్.. బాలాపూర్ అంటే లడ్డూ" అనే స్థాయిలో ఈ వేలం పాటకు ప్రత్యేక గుర్తింపు వచ్చింది. సంవత్సరాలు గడిచేకొద్దీ వేలం ధరలోనే కాకుండా బాలాపూర్ లడ్డూ ఖ్యాతి కూడా అంచెలంచెలుగా పెరుగుతూ వస్తోంది.

**2026 రికార్డు ధరలో బాలాపూర్ గణేషన్ లడ్డూ వేలం పాట..**

2026 లో పోటాపోటీ జరిగిన లడ్డూ వేలం పోటీలో సాహెబ్ నగర్ కు చెందిన అర్బన్ గ్రూప్ ఆఫ్ కంపెనీ చైర్మన్ సామ ప్రణీత్ రెడ్డి 39 లక్షల చెందిన దక్కించుకున్నాడు.

**గతంలో కంటే ఈసారి నాలుగు లక్షల అధికం..**

2025లో 35 లక్షలకు లింగాల దశరథ్ గౌడ్ బాలాపూర్ లడ్డును తగ్గించుకున్నారు. భారీ బందోబస్తు నడుమ లడ్డూ వేలం పాట ముగిసిన తర్వాత నిమజ్జనానికి బాలాపూర్ గణనాథ తరలి వెళ్తున్నాడు.

**లడ్డు వేలం పాటలో దక్కించుకున్నవారు..**

1. 1994 -- కొలను మోహన్ రెడ్డి రూ.450,
2. 1995 -- కొలను మోహన్ రెడ్డి రూ.4500,
3. 1996- కొలను కృష్ణారెడ్డి -- రూ.18,000,
4. 1997- కొలను కృష్ణారెడ్డి -- రూ.28,000,
5. 1998- కొలను మోహన్ రెడ్డి -- రూ.51,000,
6. 1999- కళ్లెం ప్రతాప్ రెడ్డి -- రూ.65,000,
7. 2000- కళ్లెం అంజిరెడ్డి -- రూ.66,000
8. 2001- జి. రఘునందన్ చారి -- రూ.85,000
9. 2002- కందాడ మాధవరెడ్డి -- రూ.1,05,000
10. 2003- చిగురింత బాల్ రెడ్డి -- రూ.1,55,000
11. 2004- కొలన్ మోహన్ రెడ్డి -- రూ.2,01,000
12. 2005- ఇబ్రహీం శేఖర్ -- రూ.2,08,000
13. 2006- చిగురింత తిరుపతి రెడ్డి -- రూ.3,00,000
14. 2007- రఘు నందన్ చారి -- రూ. 5,15,000
15. 2008- కొలన్ మోహన్ రెడ్డి -- రూ.5,07,000
16. 2009- సరిత -- రూ. 5,10,000
17. 2010: కొడాలి శ్రీధర్ బాబు -- రూ. 5,35,000
18. 2011: కోలన్ ఫ్యామిలీ -- రూ. 5,45,000
19. 2012: పన్నాల గోవర్ధన్ -- రూ. 7,50,000
20. 2013: తీగల కృష్ణారెడ్డి -- రూ. 9,26,000
21. 2014: సింగిరెడ్డి జైహింద్ రెడ్డి -- రూ. 9,50,000
22. 2015: కళ్లెం మదన్ మోహన్ రెడ్డి -- రూ. 10,32,000
23. 2016: స్కైలాబ్ రెడ్డి -- రూ. 14,65,000
24. 2017: నాగం తిరుపతి రెడ్డి -- రూ. 15,60,000
25. 2018: శ్రీనివాస్ గుప్తా -- రూ. 16,60,000
26. 2019: కోలను రామిరెడ్డి -- రూ. 17,60,000
27. 2020: కరోనా కారణంగా వేలం పాట జరగలేదు
28. 2021: మర్రి శశాంక్ రెడ్డి, రమేశ్ యాదవ్ -- రూ. 18,90,000
29. 2022: వంగేటి లక్ష్మారెడ్డి -- రూ. 24,60,000
30. 2023: దాసరి దయానంద రెడ్డి -- రూ. 27,00,000
31. 2024: కోలను శంకర్ రెడ్డి -- రూ. 30,01,000
32. 2025: లింగాల దశరథ్ గౌడ్ -- రూ. 35,00,000
33. 2026: సామ ప్రణీత్ రెడ్డి -- రూ. 39,00,000



## కొడంగల్‌కు రూ.1,410.59 కోట్ల రోడ్ల పనులు!

**కొడంగల్,ఫ్లాష్ ఇండియా :** కొడంగల్ నియోజకవర్గ రహదారి అభివృద్ధికి ప్రభుత్వం భారీగా నిధులు కేటాయించింది. ఒకేసారి 223 బ్యాలెన్స్, కొత్త బీటీ రోడ్ల పనులకు రూ. 1,410.59 కోట్ల అంచనా వ్యయంతో పరిపాలనా అనుమతులు మంజూరు చేసింది. కొడంగల్ నియోజకవర్గ పరిధిలోని వికారాబాద్, నారాయణపేట జిల్లాల్లో ఈ పనులు చేపట్టనున్నారు. 2026--27 ప్రత్యేక అభివృద్ధి నిధుల కింద ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. దీంతో గ్రామాలు, తండాలను ప్రధాన రహదారులతో అనుసంధానించే రోడ్ల పనులకు మార్గం సుగమమైంది.

**రెండు జిల్లాలు.. 223 పనులు**

మొత్తం 223 పనుల్లో వికారాబాద్ జిల్లాలో 128 పనులకు రూ. 632.74 కోట్లు, నారాయణపేట జిల్లాలో 95 పనులకు రూ. 777.84 కోట్లు కేటాయించారు. సాధారణ విభాగంలో 118 పనులకు రూ. 802.45 కోట్లు, ఎస్సీ ప్రత్యేక అభివృద్ధి నిధి కింద 51 పనులకు రూ. 316.27 కోట్లు, ఎస్టీ ప్రత్యేక అభివృద్ధి నిధి కింద 54 పనులకు రూ. 291.86 కోట్లు ఉన్నాయి. గ్రామాలు, తండాలకు కనెక్టివిటీ జీవో ఆర్‌టీ నం. 202, ప్రణాళిక శాఖ ద్వారా ప్రభుత్వం పరిపాలన అనుమతి ఇచ్చింది. కొడంగల్, బొంరాస్‌పేట్, దుద్యాల, దౌల్తాబాద్ తదితర మండలాల్లో బీటీ రోడ్లు, లింక్ రోడ్లు, వంతెనల పనులు ప్రతిపాదించారు. రూ. 1,410.59 కోట్ల విలువైన 223 రోడ్ల పనులకు అనుమతులు రావడంతో కొడంగల్ నియోజకవర్గంలో రహదారి మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వ నిర్ణయం కార్యరూపం దాల్చే దిశగా తదుపరి ప్రక్రియ ప్రారంభం కానుంది. పనుల పురోగతిని బట్టి నిధులు విడుదల చేయనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

# గంగమ్మ ఒడిలో ఖైరతాబాద్ గణేషుడు

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** గంగమ్మ ఒడికి ఖైరతాబాద్ మహా గణపయ్య చేరుకున్నారు. హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ క్రేన్ నంబర్ - 4 దగ్గర పంచముఖ సంకట హర మహా గణపతిని నిమజ్జనం చేశారు. గణనాథుడికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం గంగమ్మ ఒడికి చేర్చారు. లంబోదరుడిని చూడటానికి భక్తులు భారీగా తరలివచ్చారు. భక్తుల రద్దీ నేపథ్యంలో పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్త జన సంద్రంగా ఆ ప్రాంతంమొత్తం మారింది. సెక్రటేరియట్ సౌత్ ఈస్ట్ మార్గంలో భక్తులు కిక్కిరిసి పోయారు.

**అప్పర్ ట్యాంక్ బండ్‌పై కోలాహలంగా నిమజ్జనోత్సవాలు**

కాగా, అప్పర్ ట్యాంక్ బండ్‌పై అత్యంత కోలాహలంగా వినాయక విగ్రహాల నిమజ్జనోత్సవాలు కొనసాగుతున్నాయి. జంట నగరాల నుంచి భారీగా విగ్రహాలు తరలివస్తున్నాయి. 12 క్రేన్ల ద్వారా నిమజ్జనం ప్రక్రియ కొనసాగుతోంది. భద్రతకోసం పోలీస్ కంట్రోల్ రూం ద్వారా 58 సీసీటీవీ కెమెరాలతో పోలీసులు పటిష్ఠ నిఘా ఏర్పాటు చేశారు. ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం పూర్తి అయ్యేలా అప్పర్ ట్యాంక్ బండ్‌పై భారీగా పోలీసులు బందోబస్తు నిర్వహిస్తున్నారు. ప్రతి క్రేన్ వద్ద ఒక ఎస్ఐ, ఐదుగురు పోలీస్ సిబ్బందితో పర్యవేక్షిస్తున్నారు. నిమజ్జన ప్రాంతాల్లో రంగంలోకి 25 క్రైమ్ టీమ్స్, 10 షీ టీమ్స్ బృందాలు విధులు నిర్వహిస్తున్నారు. ఉదయం 5 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 479 విగ్రహాల నిమజ్జనం పూర్తి అయ్యాయని పోలీసులు పేర్కొన్నారు.

**గణేశ్ నిమజ్జనంపై హైటెక్ నిఘా.. 10 వేల కెమెరాలు, డ్రోన్లు రెడీ.!**

హైదరాబాద్ మహానగరంలో గణేశ్ నిమజ్జన ఉత్సవాలను అత్యంత శాంతియుతంగా, సురక్షితంగా నిర్వహించేందుకు పోలీసు శాఖ అపూర్వమైన రీతిలో భారీ హైటెక్ భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. నగర వ్యాప్తంగా నిమజ్జన ప్రక్రియను అంగుళం అంగుళం పర్యవేక్షించేందుకు సమీకృత కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్ వేదికగా కట్టుదిట్టమైన వ్యవస్థను సిద్ధం చేశారు. హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండ కమిషనరేట్ల పరిధితో పాటు మల్కాజిగిరి ప్రాంతాల్లో జరుగుతున్న నిమజ్జన కార్యక్రమాలను కమాండ్ కంట్రోల్ రూమ్ నుంచి సీనియర్ అధికారులు నిరంతరం ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తున్నారు.

**బాలాపూర్ నుంచి హుస్సేన్ సాగర్ వరకు డ్రోన్ నిఘా**

నగరవ్యాప్తంగా దాదాపు 10,000కు పైగా అధునాతన సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానించారు. ముఖ్యంగా బాలాపూర్ నుంచి హుస్సేన్ సాగర్ వరకు సాగే ప్రధాన నిమజ్జన శోభాయాత్ర మార్గంలో ప్రతి అడుగును ఈ కెమెరాల ద్వారా డిజిటల్‌గా మానిటర్ చేస్తున్నారు. దీనికి అదనంగా ప్రత్యేకంగా 12 హై-రెజల్యూషన్ డ్రోన్లను రంగంలోకి దింపారు. ఈ డ్రోన్ల ద్వారా వచ్చే లైవ్ విజువల్స్ ఆధారంగా శోభాయాత్రలో రద్దీ తీవ్రతను, శాంతిభద్రతల పరిస్థితిని ఎప్పటికప్పుడు అంచనా వేస్తూ క్షేత్రస్థాయి సిబ్బందికి తగిన సూచనలు అందిస్తున్నారు.

**15 వేల మంది పోలీసులు.. 15 శాఖల మల్టీ-ఏజెన్సీ సమన్వయం**

ఈ భారీ ఉత్సవం సునాయాసంగా సాగేందుకు రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 15,000 మంది పోలీస్ సిబ్బందిని విధుల్లో నియమించారు. కేవలం పోలీస్ శాఖ మాత్రమే కాకుండా హైడ్రా, విద్యుత్, రెవెన్యూ, ఆరోగ్య, అగ్నిమాపక శాఖలతో పాటు సుమారు 12 నుంచి 15 విభిన్న ప్రభుత్వ శాఖల అధికారులు కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి సంయుక్తంగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఉత్సవాల్లో ఏదేని అత్యవసర పరిస్థితి తలెత్తితే లేదా 112 నంబర్‌కు బాధితుల నుంచి కాల్స్ వస్తే తక్షణమే స్పందించేలా మల్టీ-ఏజెన్సీ రెస్పాన్స్ టీమ్‌లు క్షేత్రస్థాయిలో సిద్ధంగా ఉన్నాయి.

**నెల రోజుల బ్యాకప్.. గంట గంటకు విగ్రహాల లెక్కింపు**

భద్రత విషయంలో రాజీ పడకుండా ఈ నిఘా కెమెరాల ద్వారా రికార్డయ్యే దృశ్యాలన్నింటినీ నెల రోజుల పాటు భద్రపరిచేలా విస్తృత రికార్డింగ్ బ్యాకప్ వ్యవస్థను ఏర్పాటు చేశారు. శోభాయాత్రలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేదా ఆకతాయిల చర్యలు చోటుచేసుకున్నా, ఈ డిజిటల్ డేటాను ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్లకు అందించి నిందితులను వేగంగా గుర్తించడానికి ఉపయోగిస్తారు. అలాగే వివిధ ఘాట్ల వద్ద ప్రతి గంటకు నిమజ్జనమైన గణనాథుల విగ్రహాల ఖచ్చితమైన వివరాలను సేకరించి, సీనియర్ అధికారులకు ఎప్పటికప్పుడు అప్‌డేట్స్ అందిస్తూ నిమజ్జన ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు.

# రూ.2.1 కోట్ల లావాదేవీలపై ఈడీ ఆరా

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణలో సంచలనం సృష్టించిన 'సాహితి ఇన్‌ఫ్రాటెక్ వెంచర్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్' మనీలాండరింగ్ కేసు దర్యాప్తులో ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దూకుడు పెంచింది. ఈ కుంభకోణానికి సంబంధించి శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీకి ఈడీ అధికారులు గురువారం నోటీసులు జారీ చేశారు. ఈ కేసుకు సంబంధించి సెప్టెంబర్ 27న విచారణకు హాజరుకావాలని ఆ ఆదేశాల్లో స్పష్టం చేశారు.

**రూ.2.1 కోట్ల లావాదేవీలపై ఈడీ ఆరా..**

సాహితి ఇన్‌ఫ్రా సంస్థ నుంచి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ బ్యాంక్ ఖాతాల ద్వారా సుమారు రూ. 2.1 కోట్లు మళ్లించబడినట్లుగా ఈడీ దర్యాప్తులో గుర్తించింది. ఈ ఆర్థిక లావాదేవీల స్వభావం, వాటి వెనుక ఉన్న ఉద్దేశం ఏమిటి? ఈ నిధులకు సరైన వ్యాపార కారణాలు ఏమైనా ఉన్నాయా అనే కోణంలో అధికారులు లోతుగా ఆరా తీస్తున్నారు. మనీలాండరింగ్ నెట్‌వర్క్‌తో సంబంధం ఉన్న ఆస్తులపై కూడా ఈడీ ప్రత్యేకంగా దృష్టి సారించింది. ప్రీ-లాంచ్ ఆఫర్ల పేరుతో అమాయక కొనుగోలుదారుల నుంచి భారీగా నిధులు వసూలు చేసిన సాహితి ఇన్‌ఫ్రా సంస్థ, ఆ తర్వాత ఫ్లాట్లు, విల్లాలు అందించకుండా ఘోరంగా మోసం చేసింది. ప్రాజెక్టులను సకాలంలో పూర్తి చేయలేదంటూ బాధితులు ఇచ్చిన ఫిర్యాదులతో తెలంగాణ పోలీసులు పలు ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. ఆ కేసుల ఆధారంగా ఈడీ మనీలాండరింగ్ కోణంలో దర్యాప్తు చేపట్టింది

**పెరిగిన మోసం విలువ..**

తొలుత సాహితి ఇన్‌ఫ్రా ప్రాజెక్టుల్లో రూ. 248 కోట్ల మోసం జరిగినట్లు అంచనా వేయగా, తదుపరి దర్యాప్తులో ఈ కుంభకోణం విలువ ఏకంగా రూ. 842 కోట్లకు చేరినట్లుగా ఈడీ తేల్చింది. సేకరించిన నిధులను సంస్థ ఎండీ బి. లక్ష్మీనారాయణ, మాజీ డైరెక్టర్ సందు పూర్ణచంద్రరావు తదితరులు సొంత, కుటుంబ సభ్యుల ఖాతాలకు మళ్లించినట్లుగా ఆరోపణలున్నాయి. 2018-2020 మధ్య కాలంలో రూ. 50 కోట్లు నగదు రూపంలో తీసుకున్నట్లుగా, దాదాపు రూ. 126 కోట్ల నిధులు దుర్వినియోగం అయినట్లుగా ఈడీ పేర్కొంది.

**ఈడీ ఇప్పటివరకు తీసుకున్న చర్యలు ఇవే..**

బినామీ పేర్లతో ఆస్తులు కొనుగోలు చేసినట్లుగా గుర్తించిన ఈడీ, గతంలో రూ. 161 కోట్ల విలువైన ఆస్తులను.. ఆ తర్వాత మరో విడతలో రూ. 12.6 కోట్ల విలువైన ఆస్తులను అటాచ్ చేసింది. నిందితులకు సంబంధించిన మొత్తం 56 బ్యాంక్ ఖాతాలను ఇప్పటివరకు ఫ్రీజ్ చేశారు. ఈ సంస్థ ప్రకటనల్లో కనిపించిన ప్రముఖ టాలీవుడ్ నటుడు జగపతిబాబును సైతం ఈడీ సాక్షిగా విచారించింది. హైదరాబాద్‌లోని ఎంఎస్జే కోర్టులో ఇప్పటికే ప్రాసిక్యూషన్ ఫిర్యాదులను కూడా దాఖలు చేశారు.

## అక్టోబర్ 2 నుంచి దేశవ్యాప్త ఆందోళనలు

**ఢిల్లీ :** కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ తన పదవికి తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ ఉద్యమానికి పిలుపునిచ్చింది. జ్ఞానేశ్ కుమార్ పదవి నుంచి తప్పుకోకపోతే అక్టోబర్ 2న మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని ముంబై వేదికగా దేశవ్యాప్త ఆందోళనలను ప్రారంభిస్తామని సీజేపీ జాతీయ కన్వీనర్ అభిజీత్ దీప్కే స్పష్టం చేశారు. ఈ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్ (ట్విట్టర్) వేదికగా పోస్ట్ చేస్తూ.. "జ్ఞానేశ్ కుమార్ శనివారంలోగా రాజీనామా చేయకపోతే, అక్టోబర్ 2న ముంబై నుంచి నిరసనలను ప్రారంభించి, దేశంలోని అన్ని ప్రధాన నగరాలకు ఈ ప్రజా ఉద్యమాన్ని విస్తరిస్తాం. ఈ గాంధీ జయంతి వేళ ప్రజాస్వామ్యాన్ని కాపాడుకుంటామని ప్రతిజ్ఞ చేద్దాం" అని హెచ్చరికలు జారీ చేశారు.ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా ఇతర ఎన్నికల కమిషనర్లను పక్కనపెట్టి ఏకపక్ష నిర్ణయాలు తీసుకోవడం, కోట్ల సంఖ్యలో ఓట్ల తొలగింపు వంటి అంశాలపై తీవ్ర ఆరోపణలు వస్తున్న తరుణంలో సీజేపీ ఈ అల్టిమేటం విధించింది. ఓటు హక్కును హరిస్తూ ప్రజాస్వామ్య వ్యవస్థను కాలరాసే విధానాలను సహించేది లేదని, రాజ్యాంగ పరిరక్షణ కోసం దేశవ్యాప్త పోరాటానికి ఇది సరైన సమయమని పార్టీ నేతలు పేర్కొన్నారు. శనివారంలోగా సీఈసీ తన పదవి నుంచి వైదొలగకపోతే ఢిల్లీలో 'జంతర్ మంతర్ 2.0' తరహా భారీ ప్రజా నిరసనలు తప్పవని హెచ్చరించడంతో జాతీయ రాజకీయాల్లో ఎన్నికల సంఘం వివాదం మరింత వేడెక్కింది.

# 13 కోట్ల ఓట్ల తొలగింపు వెనుక బీజేపీ కుట్ర..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** కేంద్ర ఎన్నికల సంఘం తీరుపై, ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్‌పై భువనగిరి లోకసభ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. దేశవ్యాప్తంగా జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలనే డిమాండ్ బలంగా వినిపిస్తోందని, బీజేపీ తన రాజకీయ ప్రయోజనాల కోసమే ఆయనను కుట్రపూరితంగా ఆ పదవీలో కూర్చోబెట్టిందని ఆరోపించారు. గతంలో కేంద్ర ఎన్నికల ప్రధాన కమిషనర్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి సభ్యుడిగా ఉన్న కమిటీ ఎంపిక చేసే సాంప్రదాయం ఉండేదని ఎంపీ చామల గుర్తుచేశారు. అయితే, ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఇద్దరూ కావాలనే సీజేఐని ఆ ఎంపిక ప్రక్రియ నుంచి తప్పించి, తమకు అనుకూలమైన వ్యక్తిని సీఈసీగా నియమించుకున్నారని విమర్శించారు. సెలెక్షన్ ప్రాసెస్ నుంచే ఎన్నికల కమిషన్ను బీజేపీ తమ ఆధీనంలో పెట్టుకుందని మండిపడ్డారు.

**13 కోట్ల ఓట్ల తొలగింపు..**

రాజ్యాంగం పౌరులకు కల్పించిన ఓటు హక్కును తొలగించే కుట్ర సీఈసీ జ్ఞానేశ్ కుమార్ ఆధ్వర్యంలో జరుగుతోందని ఎంపీ ఆరోపించారు. ఫామ్ 6 ద్వారా దేశవ్యాప్తంగా ఏకంగా 13 కోట్ల ఓట్లను అక్రమంగా తొలగించారని, తొలగించిన వారికి మళ్లీ ఓటు హక్కు పొందే అవకాశం కూడా ఇవ్వడంలేదని తెలిపారు. హర్యానా ఎన్నికల వివాదంలో రాహుల్ గాంధీ సీసీటీవీ ఫుటేజ్ అడిగినా ఇవ్వలేదని, నిబంధనల ప్రకారం 45 రోజుల పాటు ఉంచాల్సిన ఫుటేజ్‌ను ఎందుకు దాచారని ప్రశ్నించారు. అలాగే కర్ణాటకలోని మహదేవపుర నియోజకవర్గంలో లక్షకు పైగా బల్క్ ఓట్లను నమోదు చేసి, ఫొటోగ్రాఫ్‌లను మార్చేశారని ఆధారాలతో సహా విమర్శించారు.

**సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలి..**

దేశంలో ఎప్పటికీ తమదే అధికారంగా ఉండాలని గుజరాత్ మోడల్ తరహాలో మోడీ అమిత్ షా భ్రమపడుతున్నారని, దీనికోసం సెక్యులర్ దేశాన్ని భ్రష్టు పట్టించారని ఎంపీ చామల ధ్వజమెత్తారు. ప్రస్తుతం జరుగుతున్న ఓట్ల తొలగింపు ప్రక్రియను వెంటనే నిలిపివేయాలని, ఇటీవల జరిగిన ఎన్నికలపై సమగ్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. జ్ఞానేశ్ కుమార్‌ను తొలగించాలంటే పార్లమెంట్లో అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టాలని, సుప్రీంకోర్టు స్వయంగా జోక్యం చేసుకుని రాజ్యాంగాన్ని పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# ఫాలోవర్స్ కోసం రిస్క్..

## యూట్యూబ్, ఇన్‌స్టా కోసం మావోయిస్టు లేఖ

## వ్యూస్ పెంచుకునేందుకు బెదిరింపు డ్రామా

**మెదక్,ఫ్లాష్ ఇండియా :** ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లలో ఫాలోవర్స్, వ్యూయర్స్ పెరగాలన్న ఉద్దేశంతో రకరకాలుగా ప్రయత్నిస్తారు. కానీ మెదక్ జిల్లాకు చెందిన ఇద్దరు మాత్రం ఏకంగా మావోయిస్టు బెదిరింపు లేఖ రాసి పోలీసులకు చిక్కి కటకటాల్లోకి వెళ్లిన ఘటన జిల్లాలో జరిగింది. ఇందుకు సంబంధించిన వివరాలను మెదక్ జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు శుక్రవారం మీడియా సమావేశంలో వెల్లడించారు. మెదక్ జిల్లా తూప్రాన్ మండలం నాగులపల్లికి చెందిన బండ మధు డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. తనకు ఇన్‌స్టాగ్రామ్‌లో అలెగ్జాండర్-విపిన్, యూట్యూబ్‌లో పవర్ ఆఫ్ మనీ పేరిట అకౌంట్లు ఉన్నాయి. స్వతహాగా నిత్యం రీల్స్ చూసే అలవాటు ఉన్న మధుకు కూడా సోషల్ మీడియాలో కొత్త రీల్స్ చేసి బాగా డబ్బులు సంపాదించాలని ఆలోచించేవాడు. కానీ తన అకౌంట్‌లో ఫాలోవర్స్ పెరగకపోవడం మూలంగా వ్యూయర్స్ మాత్రం రావడం లేదు.మధు తన యజమానితో కలిసి మేడారం వెళ్లగా, అక్కడ సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన సందర్భంగా ఏర్పడిన మావోయిస్టు లేఖను చూసి, అదే ప్రేరణగా తీసుకొని ఛత్తీస్‌గఢ్‌లో పది మంది మావోయిస్టులకు విధించిన మరణ శిక్షను రద్దు చేయాలన్న రెండో లేఖ పేరుతో ఎర్రటి వస్త్రంపై బెదిరింపు లేఖ రాశాడు. ఈ లేఖను చాట్‌జీపీటీలో తీసుకున్నాడు. అదే రాసి, అదే గ్రామానికి చెందిన చింతకింది శ్రీధర్‌తో కలిసి బైక్‌పై వచ్చి తూప్రాన్ మున్సిపల్ కార్యాలయం, పోలీస్ స్టేషన్‌లో లేఖలు పెట్టాడు. పోలీస్ స్టేషన్‌లో ఉన్న గార్డ్ గట్టిగా అరవగా.. 'మై ఛత్తీస్‌గఢ్ సే ఆయా' అంటూ అక్కడి నుంచి బైక్‌పై పారిపోయారు.మావోయిస్టు బెదిరింపు లేఖను మధు తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేయడంతో బాగానే వైరల్ అయింది. అదే పోస్టును స్నేహితులకు కూడా షేర్ చేశాడు. మావోయిస్టు బెదిరింపు లేఖపై సీరియస్‌గా తీసుకున్న ఎస్పీ, తూప్రాన్ డీఎస్పీ నరేందర్‌గౌడ్ ఆధ్వర్యంలో మూడు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి విచారణ చేయగా, లేఖ రాసింది మధు, శ్రీధర్‌లుగా గుర్తించి అదుపులోకి తీసుకొని విచారించారు. వీరికి మావోయిస్టులతో ఎలాంటి సంబంధం లేదని, కేవలం ఇన్‌స్టాగ్రామ్, యూట్యూబ్‌లో ఫాలోవర్స్, వ్యూయర్స్ పెంచుకునేందుకు మాత్రమే బెదిరింపు లేఖ రాసినట్టు గుర్తించారు. నిందితుల వద్ద నుంచి బైక్, మొబైల్ ఫోన్లు, రెయిన్‌కోట్, శాలువాను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్ చేసినట్లు ఎస్పీ వెల్లడించారు. సోషల్ మీడియాలో ఫాలోవర్స్, వ్యూయర్స్ కోసం ఎలాంటి తప్పుడు దారులు వెతికి జైలు పాలు కావద్దని హెచ్చరించారు. ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ విక్రమ్‌కుమార్‌సింగ్, డీఎస్పీ నరేందర్‌గౌడ్, ఎస్ఐ గంగరాజు ఉన్నారు. ఈ కేసులో నిందితులను తక్కువ సమయంలో గుర్తించిన పోలీస్ సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

# ఏంటీ ఈ చోద్యం..!

**ఖమ్మం,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ గుర్తింపు సంఘాల ఎన్నికల్లో విచిత్ర సంఘటన చోటు చేసుకుంది. రాష్ట్రంలో జరుగుతున్న ఆర్టీసీ గుర్తింపు సంఘాల ఎన్నికలకు కాంగ్రెస్ పార్టీ టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ టీ డబ్ల్యూ యూ రిజిస్ట్రేషన్ నెంబర్ 4522 కు కాంగ్రెస్ పార్టీ తరపున పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు శుక్రవారం ఉదయం ప్రకటన విడుదల చేశారు. ఖమ్మం జిల్లాలో సాయంత్రం మాత్రం జిల్లా అధ్యక్షుడు నూతి సత్యనారాయణ మాత్రం ఐఎన్టీయూసీకి కాంగ్రెస్ పార్టీ మద్దతు ఇస్తున్నట్లు ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షుడు ఒకటి ఉంటే... జిల్లా అధ్యక్షుడు ప్రకటన మరోలా ఉంది. ఇద్దరు వేరు వేరు ప్రకటన విడుదల చేయడంతో ఆర్టీసీ కార్మికులు అయోమయంలో ఉన్నారు. అసలు నిజంగా ఎవరికి మద్దతిస్తున్నారు అంటూ కామెంట్లు చేస్తున్నారు.

ఫ్లాష్ ఇండియా దినపత్రిక బుక్ చేసుకోవాలి అనుకుంటున్నారా లేదా మీ వ్యాపార ప్రకటనల కోసం మమ్మల్ని సంప్రదించండి 7730032999 flashindiadaily@gmail.com



## తెలంగాణ ఆర్టీసీ ఎన్నికల వేళ కీలక పరిణామం..

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** తెలంగాణ ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికల వేళ కీలక పరిణామం చోటుచేసుకుంది. అక్టోబర్ 9న జరగనున్న ఆర్టీసీ యూనియన్ ఎన్నికల్లో 'తెలంగాణ ఆర్టీసీ వర్కర్స్ యూనియన్' (TWU - రిజిస్ట్రేషన్ నంబర్: 4-4522)కు కాంగ్రెస్ పార్టీ తరఫున పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు టీపీసీసీ అధ్యక్షులు, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ఈ మేరకు పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు, జిల్లాల అధ్యక్షులకు సమాచారం అందించారు. టీడబ్ల్యూయూ యూనియన్ కాంగ్రెస్ పార్టీకి అనుబంధంగా పనిచేస్తోందని మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాల , సిటీ కాంగ్రెస్ అధ్యక్షులకు, ఎమ్మెల్యేలకు ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. తమ తమ నియోజకవర్గాల పరిధిలోని ఆర్టీసీ డిపోలలో కాంగ్రెస్ అనుబంధ టీడబ్ల్యూయూ యూనియన్‌కు సంపూర్ణ సహకారాన్ని, సమన్వయాన్ని అందించాలని, ఇతర ఏ యూనియన్లను ప్రోత్సహించవద్దని తేల్చి చెప్పారు.

**బొంతు రామ్మోహన్‌కు కీలక బాధ్యతలు..**

ఆర్టీసీ గుర్తింపు సంఘం ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కాంగ్రెస్ పార్టీ.. క్షేత్రస్థాయిలో సమన్వయం కోసం ప్రత్యేక ఇన్‌చార్జిని నియమించింది. టీపీసీసీ ఉపాధ్యక్షులు, గ్రేటర్ హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌ను ఈ ఎన్నికల సమన్వయకర్తగా నియమిస్తున్నట్లు చీఫ్ వెల్లడించారు. బొంతు రామ్మోహన్ ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు, ఆర్టీసీ కార్మికులు సమన్వయంతో పనిచేసి టీడబ్ల్యూయూ విజయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## సమన్వయంతో నిమజ్జనోత్సవాలను విజయవంతం చేయండి



కాప్రా: అధికారులు సమన్వయంతో వినాయక నిమజ్జనోత్సవాలను విజయవంతం చేయాలని మల్కాజ్గిరి మున్సిపల్ కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం కాప్రా, చర్లపల్లి చెరువుల వద్ద బేబీ పాండు లతో చేపట్టిన వినాయక నిమజ్జన ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా నిమజ్జనానికి వచ్చే గణనాథులను క్రమ పద్ధతిలో నిమజ్జనం చేసే ఏర్పాట్లను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... ప్రజలు ప్రశాంతంగా భక్తిశ్రద్ధలతో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వినాయక నిమజ్జనాల కార్యక్రమాన్ని చేసుకోవాలని సూచించారు. అధికారులు ప్రణాళిక బద్ధంగా ఏర్పాటు చేసిన విధంగా భక్తులు చెరువులో వద్ద నిమజ్జనాలను చేయాలన్నారు. క్యూ పద్ధతి పాటించడం, ఐదు ఫీట్ల లోపు వినాయకులను మాత్రమే బేబీ పాండ్ లలో వేయాలన్నారు. ఇక కాప్రా చెరువు వద్ద చేపట్టిన ఏర్పాట్లను డి ఈ బాలకృష్ణ వినయ్ కృష్ణారెడ్డికి వివరించారు. ఈ కార్యక్రమంలో కాప్రా సర్కిల్ డిసి రవీంద్ర సాగర్, ఏ.ఈ ప్రవంతి, పోలీస్ సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## 'బెస్ట్ పబ్లిక్ సర్వెంట్' అవార్డు.!

**కేరళ:** కేరళలోని నిలంబూర్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మక 'ఆర్యదాన్ ముహమ్మద్ -- 2026' బెస్ట్ పబ్లిక్ సర్వెంట్ అవార్డును ఘనంగా అందుకున్నారు. కేరళ కాంగ్రెస్ దిగ్గజ నేత, దివంగత ఆర్యదాన్ ముహమ్మద్ స్మారకార్థం 'ఆర్యదాన్ ముహమ్మద్ ఫౌండేషన్' ఏర్పాటు చేసిన ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని సీఎం రేవంత్ రెడ్డికి ఫౌండేషన్ ప్రతినిధులు , ఏఐసీసీ ముఖ్య నేతలు సస్కారపూర్వకంగా ప్రదానం చేశారు. ఈ సందర్భంగా రూ. లక్ష నగదు బహుమతి, ప్రశంసాపత్రం , జ్ఞాపికను ముఖ్యమంత్రికి అందజేశారు.

**ప్రజా సంక్షేమ పాలనకు దక్కిన గౌరవం**

తెలంగాణ రాష్ట్రంలో రైతులు, వెనుకబడిన వర్గాలు (బీసీలు) , సామాన్య ప్రజల సంక్షేమం కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేపట్టిన వినూత్న పథకాలు, ఆయన కనబరుస్తున్న దూరదృష్టి గల పరిపాలనా వైఖరికి గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందించారు. ప్రజాస్వామిక విలువల పట్ల రేవంత్ రెడ్డికి ఉన్న నిబద్ధతను, సమర్ధవంతమైన నాయకత్వాన్ని అవార్డు ఎంపిక జ్యూరీ సభ్యులైన ఎంపీ బెన్నీ బెహనన్, కేరళ మంత్రి ఎ.పి. అనిల్‌కుమార్ , ప్రముఖ మేధావి కల్పేట్టా నారాయణన్ ప్రత్యేకంగా కొనియాడారు.

**కార్యక్రమంలో పాల్గొన్న ఏఐసీసీ కీలక నేతలు**

దివంగత ఆర్యదాన్ ముహమ్మద్ నాలుగో వర్ధంతిని పురస్కరించుకుని నిర్వహించిన ఈ ప్రదానోత్సవ వేడుకలో ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) కె.సి. వేణుగోపాల్ ముఖ్య అతిథిగా హాజరై స్మారక ఉపన్యాసం చేశారు. ఎనిమిది సార్లు ఎమ్మెల్యేగా, నాలుగు సార్లు మంత్రిగా సేవలు అందించి కేరళ ప్రజల గుండెల్లో చెరగని ముద్ర వే-సుకున్న ఆర్యదాన్ ముహమ్మద్ పేరిట నెలకొల్పిన తొలి ప్రతిష్టాత్మక పురస్కారాన్ని తెలంగాణ ముఖ్యమంత్రి స్వీకరించడం పట్ల పలువురు రాజకీయ ప్రముఖులు, నేతలు అభినందనలు తెలిపారు.

## అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు

**భూపాలపల్లి,ఫ్లాష్ ఇండియా :** అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు మహిళల ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖల మంత్రి ధనసరి అనసూయ సీతక్క తెలిపారు. శుక్రవారం భూపాలపల్లి మండలం పెద్దాపూర్ రైతు వేదికలో పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు 15 లక్షల కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసినట్లు తెలిపారు. రేషన్ కార్డు కేవలం బియ్యం పొందేందుకు మాత్రమే కాకుండా ఆరోగ్యశ్రీ సేవలు, ఆదాయ ధ్రువీకరణ తదితర అవసరాలకు కీలకమైన అధికారిక పత్రంగా ఉపయోగపడుతుందని తెలిపారు. మహిళలకు గౌరవం, స్వేచ్ఛతో పాటు ఆర్థిక స్వావలంబన కల్పించాలనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆలోచన మేరకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులను మహిళల పేరిటే మంజూరు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సామాజిక భద్రతా పింఛన్లు అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని, రానున్న 10 నుంచి 15 రోజుల్లో కొత్త పింఛన్ల పంపిణీ కార్యక్రమం చేపట్టనున్నట్లు వెల్లడించారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు స్వయం ఉపాధి పొందేందుకు, వ్యాపారాలు ప్రారంభించేందుకు వడ్డీలేని రుణాలు అందిస్తున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి సంఘాల ద్వారా రూ.లక్ష వరకు రుణం అందించేలా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. విబిజి రాంజీ పథకం కింద గ్రామాల్లో సుమారు 370 రకాల పనులు చేపట్టేందుకు అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీకి సగటున రూ.50 లక్షల వరకు నిధులు వచ్చే అవకాశం ఉన్నందున మేకల షెడ్లు, కోళ్ల ఫారాలు, ఫామ్ పాండ్లు, డ్రైనేజీలు, కాలువలు తదితర పనులను చేపట్టి గ్రామీణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టడంతో పాటు వీవో భవనాలు, గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో గుడిసెలు, తాత్కాలిక నివాసాల్లో ఉన్న పేదలకు మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు



మంత్రి తెలిపారు. లబ్ధిదారులు ఇల్లు నిర్మించుకోవాలనుకునే సొంత స్థలంలో నిలబడి ఫొటోలు ఇవ్వాలని సూచించారు. దీనివల్ల క్షేత్రస్థాయి పరిశీలన సులభతరం అవుతుందని పేర్కొన్నారు. జిల్లాలో అర్హులైన లబ్ధిదారులకు పారదర్శకంగా, సురక్షితంగా నిత్యావసర సరుకులు అందించేందుకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. ఆగస్టు 15 నుంచి జిల్లా వ్యాప్తంగా పంపిణీ ప్రక్రియ ప్రారంభమైందన్నారు. జిల్లా వ్యాప్తంగా 1,39,530 స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా 3,95,962 మంది లబ్ధి పొందుతున్నట్లు తెలిపారు. భూపాలపల్లి మండల పరిధిలోని పెద్దాపూర్, బావుసింగ్‌పల్లి, మూలపల్లి, లంబాడితండ, సుబ్బక్కపల్లి గ్రామాల్లో మొత్తం 1,993 స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు పేర్కొన్నారు. నకిలీ, డూప్లికేట్ కార్డులకు తావులేకుండా హోలోగ్రామ్, ఇష్యూయింగ్ అథారిటీ ముద్ర, హిడెన్ ఇమేజ్ తదితర తొమ్మిది రకాల భద్రతా ఫీచర్లను ప్రభుత్వం కార్డుల్లో పొందుపరిచినట్లు కలెక్టర్ తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డులను టి-రేషన్ మొబైల్ యాప్‌తో అనుసంధానం చేసినట్లు స్పష్టంచేశారు. దీని ద్వారా ప్రజలు తమ రేషన్ కార్డు వివరాలను డిజిటల్‌గా వినియోగించుకోవచ్చన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల విధానంతో రేషన్ పంపిణీలో లీకేజీలను అరికట్టి, అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి రావాల్సిన కోటా సక్రమంగా అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు అశోక్ కుమార్, విజయలక్ష్మి, పౌర సరఫరాల అధికారి కిరణ్ కుమార్, తహసీల్దార్ లక్ష్మి రాజయ్య, ఎంపిడిఓ తరుణ్ ప్రసాద్, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న బైక్.. వ్యక్తి మృతి

**గద్వాల,ఫ్లాష్ ఇండియా :** గద్వాల మున్సిపాలిటీ పరిధిలోని నది అగ్రహారం రోడ్డులో శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. నది అగ్రహారం నుంచి గద్వాల వైపు ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు వ్యక్తులు అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో గద్వాల పట్టణం చింతలపేటకు చెందిన మునగాల శీను (54) తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్‌పై ఉన్న ఈశ్వరన్నకు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే గద్వాల జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న యువ నాయకుడు ముత్యాల రవి జోగులాంబ గద్వాల జిల్లా ఆసుపత్రికి చేరుకుని మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. గాయపడిన ఈశ్వ-రన్నకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను కోరారు. ప్రమాదానికి గల కారణాలపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



## ముఖ్యమంత్రి సభకు ముమ్మర ఏర్పాట్లు..

**సిరిసిల్ల,ఫ్లాష్ ఇండియా :** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఈ నెల 30న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొననున్న భారీ బహిరంగ సభ నేపథ్యంలో ఏర్పాట్లు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. ఈ క్రమంలో రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ జిల్లా ఎస్పీ మహేష్ బి. గీతేతో కలిసి సభా ప్రాంగణం, పార్కింగ్ స్థలాలను పరిశీలించారు. ముఖ్యమంత్రి సభకు పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉండటంతో సభా ప్రాంగణంలో చేపట్టాల్సిన ఏర్పాట్లు, ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలు, వాహనాల పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ, భద్రతా చర్యలపై అధికారులతో సమీక్షించారు. సభకు వచ్చే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని సూచించారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సభకు హాజరయ్యే సమయంలో పట్టణంలోకి ప్రవేశించే మార్గాలను అధికారులు, పోలీసు సిబ్బందితో కలిసి పరిశీలించారు. ముఖ్యంగా అంబేద్కర్ చౌర-స్తా, చంద్రంపేట చౌరస్తా ప్రాంతాల్లో ట్రాఫిక్ పరిస్థితులను పరిశీలించారు. ముఖ్యమంత్రి కాన్వాయ్ రాకపోకలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. భారీగా ప్రజలు, వాహనాలు తరలివచ్చే అవకాశం ఉన్న నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని సూచించారు. పార్కింగ్‌కు అనువైన స్థలాలను ముందుగానే గుర్తించి, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సభకు హాజరయ్యే ప్రజల భద్రతతో పాటు తాగునీరు, పారిశుద్ధ్యం తదితర మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అధికారులకు సూచించారు. ముఖ్యమంత్రి పర్యటనను దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, సభను విజయవంతంగా నిర్వహించేందుకు అవ-సరమైన ఏర్పాట్లను సకాలంలో పూర్తి చేయాలని ఆదేశించారు.

## ఆ వార్త నమ్మొద్దు..

**ఢిల్లీ:** కేంద్ర ఎన్నికల సంఘంలో ఊహించని పరిణామాలు చోటు చేసుకుంటున్నాయి. చీఫ్ ఎలక్షన్ కమిషనర్ (సీఈసీ) జ్ఞానేష్ కుమార్ ఉత్తరప్రదేశ్‌లోని మీరట్, వారణాసి నగరాల్లో పర్యటించాల్సి ఉండగా, ఆ పర్యటనలు హఠాత్తుగా వాయిదా పడ్డాయి. ఈ ఘటన తరువాత ఈ పర్యటన రద్దు కావడానికి కమిషన్ సభ్యుల మధ్య విభేదాలే కారణమనిపుకార్లు షికార్లు చేస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఈసీఐ వివరణ ఇచ్చింది. ఈ వార్తలకు ఎలాంటి సంబంధం లేదని సీనియర్ ఎన్నికల అధికారులు స్పష్టం చేశారు. లాజిస్టికల్ ఇబ్బందులు, స్థానిక పరిస్థితులు, అలాగే సిఇసికి ఉన్న ఇతర అధికారిక కార్యక్రమాల వల్లే ఈ పర్యటనలను వాయిదా వేయాల్సి వచ్చిందని తెలిపారు. ఈ విషయాన్ని సెప్టెంబర్ 21నే నిర్ణయించి, సంబంధిత జిల్లాల అధికారులకు ఈమెయిల్ ద్వారా సమాచారం అందించినట్లు పేర్కొన్నారు. ఈ పర్యటనల వాయిదా చుట్టూ ఇంత రచ్చ జరగడానికి ప్రధాన కారణం.. ఇటీవల ఎన్నికల సంఘం లోపల విభేదాలు బయటపడ్డాయంటూ వస్తున్న వార్తలే. 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' దర్యాప్తు కథనం ప్రకారం, అక్టోబర్ 2025 నుంచి ఆగస్టు 2026 మధ్య కాలంలో ఓటర్ల జాబితాలకు సంబంధించిన పలు నిర్ణయాలపై మిగతా ఇద్దరు ఎలక్షన్ కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి ఏకంగా 14 సార్లు తమ వ్యతిరేకతను (అభ్యంతరాలను) రికార్డు చేశారు. ప్రత్యేక తీవ్ర సమగ్ర సవ-రణ , ఓటర్ల నమోదు, పేర్ల తొలగింపు, అప్పీళ్లు, ఈసీ ఓటర్ డేటా సాఫ్ట్‌వేర్ యాక్సెస్ వంటి కీలక అంశాలపై వీరు అభ్యంతరాలు వ్యక్తం చేసినట్లు సమాచారం. అయితే, ఈ సమయంలో ముగ్గురు సభ్యుల కమిషన్ కలిసి అనేక మీడియా సమావేశాల్లో పాల్గొన్నప్పటికీ, ఈ ఇద్దరు కమిషనర్లు ఎక్కడా తమ విభేదాలను బయటకు రానివ్వకపోవడం గమనార్హం. మరోవైపు, 2024 తర్వాత ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా 'ప్రత్యేక సంక్షిప్త సవరణ' చేపట్టలేదని 'ది ఎకనామిక్ టైమ్స్' నివేదించింది. 18 ఏళ్లు నిండిన కొత్త ఓటర్లు నమోదు చేసుకోవడానికి ఈ ప్రక్రియ చాలా కీలకం. ఈ ఆలస్యంపై కాంగ్రెస్ పార్టీ తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తోంది. అయితే, కేవలం ఉత్తరప్రదేశ్ పర్యటనలే కాకుండా హిమాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, లడఖ్ పర్యటనలు కూడా వాయిదా పడ్డాయని ఎన్నికల సంఘం వర్గాలు వివరణ ఇచ్చాయి. హిమాచల్ ప్రదేశ్‌లో పర్యాటక సీజన్, పరీక్షల వల్ల కార్యక్రమం వాయిదా వేయగా.. ఉత్తరాఖండ్‌లో 'SIR' ప్రక్రియ పూర్తయ్యాక యువతతో సమావేశం ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. మానససరోవర్ ప్రమాదం కారణంగా లడఖ్ పర్యటన వాయిదా పడింది. ఇలాంటి యూత్ ఇంటరాక్షన్ కార్యక్రమాలకు దాదాపు వెయ్యి మంది వరకు వస్తుంటారని, అందుకే వాతావరణం, స్థానిక పరిస్థితులు, వనరులను బట్టి సమయాన్ని ఖరారు చేస్తామని అధికారులు చెబుతున్నారు. పైగా, చీఫ్ ఎలక్షన్ కమిషనర్ ఇటీవల భూటాన్ పర్యటనకు వెళ్లడం కూడా కొన్ని కార్యక్రమాలు వెనక్కి వెళ్లడానికి కార-ణమైంది. ఇక ఒక్కో పర్యటనకు రూ. 1.5 కోట్ల వరకు ఖర్చవుతుందనే వార్తలపై స్పందిస్తూ, కార్యక్రమం నిజంగా జరిగినప్పుడు మాత్రమే ఆ ఖర్చు అవుతుంది తప్ప, వాయిదా పడితే ఖర్చు కాదని కమిషన్ వర్గాలు స్పష్టం చేశాయి.

## ఏరియల్ వ్యూ ద్వారా నిమజ్జన సరళిని పరిశీలించిన



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ నగరంలో జరుగుతున్న వినాయక నిమజ్జన శోభాయాత్ర సరళిని, భద్రతా ఏర్పాట్లను నగర ఇన్‌ఛార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఉన్నతాధికారులతో కలిసి ఏరియల్ వ్యూ ద్వారా పరిశీలించారు. బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరిన వీరు.. హుస్సేన్‌సాగర్ పరిసరాలతో పాటు నగరంలోని ప్రధాన ఊరేగింపు మార్గాలను, భక్తుల రద్దీని, ట్రాఫిక్ సరళిని వీక్షించారు. ఈ సందర్భంగా ఎంజే మార్కెట్, చార్మినార్ వద్ద ట్రాఫిక్ సమస్య ఉందని, నిర్వాహకులు మరియు భక్తులు సహకరించాలని కోరారు. ట్రాఫిక్ సమస్యకు పోలీసులు తక్షణ చర్యలు తీసుకోవాలని చెప్పారు. నిమజ్జనం ప్రశాంతంగా కొనసాగుతోందని, అయితే ఆలస్యం చేయకుండా వేగవంతం చేయాలని సూచించారు. ఏరియల్ సర్వేలో మంత్రితో పాటు రాష్ట్ర డీజీపీ సీవీ ఆనంద్, హైదరాబాద్ నగర పోలీస్ కమిషనర్ సజ్జనర్, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్.వి.కర్ణన్, హైదరాబాద్ జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆలా పాల్గొన్నారు.

## అన్ని వర్గాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



**పెగడపల్లి,ఫ్లాష్ ఇండియా :** ధర్మపురి నియోజకవర్గంలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. పెగడపల్లి మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి, సీఎం సహాయనిధి చెక్కులను మంత్రి అందజేశారు. రూ.39 లక్షల విలువైన కళ్యాణ లక్ష్మి, రూ.31 లక్షల విలువైన సీఎం సహాయనిధి చెక్కులు మంజూరు కాగా, అధికారులతో కలిసి వాటిని లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం అందించడంతో పాటు మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నామని చెప్పారు. అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రెండో విడతలో మరింత మంది అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని తెలిపారు. దసరా నాటికి మహిళలకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

**చెరువుల అభివృద్ధితో సాగునీరు**

పెగడపల్లి మండలంలో సాగునీటికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా గొల్లపల్లి మండలంలోని రంగధాముని పల్లి, దికొండ చెరువులను అభివృద్ధి చేసి పెగడపల్లి మండలంలోని వ్యవసాయ భూములకు సాగునీరు అందించేలా చర్యలు చేపడతామని చెప్పా-రు. మండలంలో మౌలిక వసతుల కల్పనకు అవసరమైన నిధులు మంజూరు చేస్తామని అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ద్వారా మండలంలోని అన్ని తండాలకు రోడ్ల నిర్మాణం కోసం నిధులు మంజూరు చేశామని మంత్రి వెల్లడించారు. సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల కోసం ప్రత్యేకంగా నిధులు కేటాయించి ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల తహసీల్దార్ సయ్యద్ నిజాముద్దీన్, ఎంపీడీవో ప్రేమ్ సాగర్, మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కడారి తిరుపతి, సర్పంచులు ఓరుగలి అరుణ శ్రీనివాస్, అయితరవేణి లక్ష్మణ్, మోకినపల్లి గోపాల్, రమేష్ నాయక్, కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు చెట్ల కిషన్, చాట్ల విజయ్ భాస్కర్, లింగంపల్లి మహేష్, బాలుసాని శ్రీనివాస్, మన్నె గంగ రాజం, నాయకులు సంధి మల్లారెడ్డి, పూసల తిరుపతి, బండారి శ్రీనివాస్, రాం రెడ్డి, సుంకరి రవి, తడగొండ రాజు, దికొండ మహేందర్, రాజు కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సంపాదకీయం




## ఖజానాపై పెరుగుతున్న భారం

రాష్ట్ర ఆర్థిక పరిస్థితి ప్రస్తుతం కీలక దశలో ఉంది. ఒకవైపు ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లకు సమయానికి జీతాలు, పింఛన్లు చెల్లించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. మరోవైపు సంక్షేమ పథకాలు, రుణాలపై వడ్డీలు, రిటైర్మెంట్ బకాయిలు వంటి నిర్బంధ వ్యయాలు ఖజానాపై ఒత్తిడిని పెంచుతున్నాయి. వీటన్నింటికీ తోడు అభివృద్ధి, మౌలిక వసతుల కోసం అవసరమైన మూలధన వ్యయానికి నిధులు కేటాయించాల్సి ఉంది. కాగ్ నివేదికలో వెల్లడైన గణాంకాలను పరిశీలిస్తే రాష్ట్ర ఆర్థిక నిర్వహణలో తక్షణ అవసరాలు, దీర్ఘకాలిక అభివృద్ధి మధ్య సమతుల్యత ఎంత ముఖ్యమో స్పష్టమవుతోంది. ఏప్రిల్ నుంచి ఆగస్టు వరకు తొలి ఐదు నెలల్లోనే ఉద్యోగుల జీతాలు, పింఛన్ల కోసం దాదాపు రూ.34 వేల కోట్లు ఖర్చు చేయడం ప్రభుత్వ స్థిర వ్యయ భారం ఎంత పెద్దదో తెలియజేస్తోంది. ఇందులో జీతాల కోసం రూ.21,536.49 కోట్లు, పింఛన్ల కోసం రూ.12,487 కోట్లు వెచ్చించారు. అంటే సగటున ప్రతి నెలా సుమారు రూ.6,600 కోట్లు ఉద్యోగులు, పెన్షనర్లకు చెల్లించాల్సి వస్తోంది. ఉద్యోగులకు సమయానికి వేతనాలు చెల్లించడం ప్రభుత్వ బాధ్యతే. అయితే ఆదాయంలో భారీ భాగం ఇలాంటి నిర్బంధ వ్యయాలకు వెళ్తుంటే అభివృద్ధి పనులకు అందుబాటులో ఉండే ఆర్థిక వనరులు తగ్గిపోవడం సహజం. ప్రస్తుతం రాష్ట్ర ఖజానా రెవెన్యూ లోటు, ద్రవ్య లోటు, అప్పుల భారంతో ఒత్తిడిని ఎదుర్కొంటోంది. ఆగస్టు చివరి నాటికి రెవెన్యూ లోటు రూ.14,840 కోట్లకు చేరగా, ద్రవ్య లోటు రూ.34,285 కోట్లుగా నమోదైంది. ఏడాది మొత్తానికి రూ.58,458 కోట్ల నికర అప్పులు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్న ప్రభుత్వం తొలి ఐదు నెలల్లోనే రూ.34,285 కోట్ల రుణాలను సమీకరించింది. అంటే వార్షిక రుణ పరిమితిలో గణనీయమైన భాగం ఇప్పటికే వినియోగించబడింది. ఈ పరిస్థితి మిగిలిన ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వం ఎదుర్కొనే ఆర్థిక సవాళ్లను సూచిస్తోంది. అప్పు చేయడం అనేది స్వతహాగా ప్రతికూల విషయం కాదు. ఆర్థిక వ్యవస్థలో రుణాలు కీలక పాత్ర పోషిస్తాయి. అయితే తీసుకున్న అప్పు ఏ రంగానికి వెళ్తోంది అన్నదే అసలు ప్రశ్న. మౌలిక వసతులు, పరిశ్రమలు, సాగునీరు, విద్య, వైద్యం, రవాణా వంటి ఉత్పాదక రంగాల్లో పెట్టుబడి పెడితే భవిష్యత్‌లో ఆర్థిక కార్యకలాపాలు, ఆదాయం పెరిగే అవకాశం ఉంటుంది. కానీ రోజువారీ నిర్వహణ ఖర్చులను భరించడానికి అప్పులపై ఆధారపడే పరిస్థితి పెరిగితే భవిష్యత్ బడ్జెట్లపై ఒత్తిడి మరింత పెరుగుతుంది. ఈ నేపథ్యంలో మూలధన వ్యయం తగ్గడం ఆందోళన కలిగించే అంశం. తొలి ఐదు నెలల్లో మూలధన వ్యయం రూ.12,412 కోట్లుగా ఉంది. గత ఏడాది ఇదే సమయంలో మూలధన వ్యయం 39.28 శాతంగా ఉండగా, ఈసారి 26.26 శాతానికి పరిమితమైంది. ప్రభుత్వ వ్యయంలో అభివృద్ధి పెట్టుబడుల వాటా తగ్గడం దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధిపై ప్రభావం చూపే అవకాశం ఉంది. ఒక రహదారి, పారిశ్రామిక మౌలిక వసతి, విద్యా సంస్థ లేదా సాగునీటి ప్రాజెక్టుపై పెట్టే పెట్టుబడి భవిష్యత్ ఆర్థిక కార్యకలాపాలకు పునాది వేస్తుంది. అందువల్ల మూలధన వ్యయాన్ని కేవలం మరో ఖర్చుగా చూడలేం. మరోవైపు ప్రభుత్వ ఆదాయ వనరుల పరిస్థితి కూడా పూర్తిగా అనుకూలంగా లేదు. నాన్-ట్యాక్స్ రెవెన్యూ ద్వారా ఏడాదికి రూ.35,730 కోట్లు సమీకరించాలని లక్ష్యంగా పెట్టుకోగా, ఆగస్టు నాటికి రూ.5,475 కోట్లు మాత్రమే వచ్చాయి. కేంద్రం నుంచి గ్రాంట్-ఇన్-ఎయిడ్ కింద రూ.24,166 కోట్లు వస్తాయని అంచనా వేసినా, ఇప్పటివరకు రూ.2,962 కోట్లు మాత్రమే సమకూరాయి. అంటే ప్రభుత్వం అంచనా వేసిన కొన్ని ఆదాయ వనరులు ఆశించిన వేగంతో సమకూరడం లేదు. పన్నుల ఆదాయం మాత్రం కొంత ఊరటనిస్తోంది. పన్నుల ద్వారా రూ.69,097.42 కోట్లు వచ్చినట్లు గణాంకాలు చెబుతున్నాయి. జీఎస్టీ, సేల్స్ ట్యాక్స్, స్టాంపులు--రిజిస్ట్రేషన్లు, ఎక్సైజ్, కేంద్ర పన్నుల వాటా ప్రధాన ఆదాయ వనరులుగా ఉన్నాయి. అయితే పన్నుల ఆదాయాన్ని పెంచడం కోసం కూడా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో పరిశ్రమలు, సేవారంగం, పెట్టుబడులు, ఉపాధి, వినియోగం పెరగాల్సి ఉంటుంది. ఆర్థిక కార్యకలాపాలు విస్తరించినప్పుడే దీర్ఘకాలంలో ప్రభుత్వ ఆదాయ సామర్థ్యం పెరుగుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో ఉద్యోగుల పెండింగ్ డీఏలు మరో ఆర్థిక సవాలుగా మారాయి. రెండు డీఏలు విడుదల చేస్తే నెలకు సుమారు రూ.637 కోట్ల అదనపు భారం, ఏడాదికి దాదాపు రూ.7,644 కోట్ల భారం పడుతుందని అంచనా. మూడు డీఏలను కలిపి 8.19 శాతం మేర విడుదల చేస్తే నెలకు రూ.819 కోట్లు, ఏడాదికి సుమారు రూ.9,828 కోట్ల అదనపు భారం పడే అవకాశం ఉంది. ఉద్యోగుల దృష్టిలో డీఏ అనేది ద్రవ్యోల్బణాన్ని ఎదుర్కొనే వేతన సవరణలో భాగం. ప్రభుత్వ దృష్టిలో మాత్రం అది ప్రతి నెలా కొనసాగాల్సిన శాశ్వత వ్యయం. ఈ రెండు కోణాల మధ్య సమతుల్యత సాధించడం కీలకం. ఇదే పరిస్థితి నూతన పీఆర్సీ అమలు విషయంలోనూ ఎదురుకావచ్చు. వేతన సవరణ ఉద్యోగుల ఆర్థిక స్థితిని మెరుగుపరచడంతో పాటు వినియోగాన్ని పెంచి ఆర్థిక వ్యవస్థకు కొంత ఊతమివ్వవచ్చు. కానీ ప్రభుత్వానికి మాత్రం అది దీర్ఘకాలికంగా కొనసాగాల్సిన వ్యయం. ఇప్పటికే జీతాలు, పింఛన్లు, రిటైర్మెంట్ బకాయిలు, వడ్డీ చెల్లింపులు పెరుగుతున్న సమయంలో కొత్త వేతన భారాన్ని సమర్థవంతంగా నిర్వహించాలంటే ముందస్తు ఆర్థిక ప్రణాళిక అవసరం. రిటైర్మెంట్ బకాయిల చెల్లింపులు కూడా ఖజానాపై అదనపు ఒత్తిడిని చూపిస్తున్నాయి. ఇప్పటికే సుమారు రూ.6 వేల కోట్ల పాత బకాయిలను చెల్లించినట్లు సమాచారం. మిగిలిన బకాయిల కోసం ప్రతి నెలా రూ.750 కోట్ల నుంచి రూ.1,000 కోట్ల వరకు అదనంగా ఖర్చు చేస్తున్న పరిస్థితి ఉంటే, ప్రస్తుత జీతాలు, పింఛన్లు, వడ్డీలు, సంక్షేమ వ్యయాలతో పాటు ఈ చెల్లింపులను నిర్వహించడం ప్రభుత్వానికి ఆర్థికంగా క్లిష్టమే. అందువల్ల రాష్ట్ర ఆర్థిక నిర్వహణకు ఇప్పుడు అత్యవసరమైనది కేవలం ఖర్చులు తగ్గించడం కాదు. ఆదాయాన్ని పెంచే మార్గాలను విస్తరించడంతో పాటు ఖర్చుల ప్రాధాన్యతలను పునఃపరిశీలించాలి. నాన్-ట్యాక్స్ రెవెన్యూ పెంపు, పెట్టుబడులను ఆకర్షించడం, పారిశ్రామిక వృద్ధిని వేగవంతం చేయడం, పన్ను వసూళ్ల సామర్థ్యాన్ని పెంచడం వంటి చర్యలపై దృష్టి పెట్టాలి. అదే సమయంలో అప్పులను ఉత్పాదక రంగాలకు మళ్లించడం, మూలధన వ్యయాన్ని సాధ్యమైనంతవరకు రక్షించడం అవసరం. సంక్షేమం, ఉద్యోగుల ప్రయోజనాలు, పింఛన్లు, అభివృద్ధి ఇవన్నీ ప్రభుత్వ బాధ్యతలే. కానీ పరిమిత వనరులతో ఈ అన్ని అవసరాలను సమర్థవంతంగా నెరవేర్చాలంటే ఆర్థిక క్రమశిక్షణ తప్పనిసరి. ఒకవైపు ఉద్యోగులకు సమయానికి జీతాలు, పింఛన్లు అందించాలి. మరోవైపు భవిష్యత్ ఆదాయాన్ని సృష్టించే పెట్టుబడులను తగ్గించకూడదు. ఈ రెండింటి మధ్య సమతుల్యతే ప్రభుత్వ ఆర్థిక విధానానికి అసలు పరీక్ష. ప్రస్తుత గణాంకాలు ఒక విషయం స్పష్టం చేస్తున్నాయి. రాష్ట్ర ఖజానాకు ఆదాయం వస్తున్నప్పటికీ, ఆ ఆదాయంపై ఇప్పటికే అనేక నిర్బంధ వ్యయాలు ఉన్నాయి. జీతాలు, పింఛన్లు, వడ్డీలు, సంక్షేమం వంటి ఖర్చులు పెరుగుతున్న సమయంలో మూలధన వ్యయం తగ్గితే దీర్ఘకాలిక ఆర్థిక వృద్ధికి నష్టం కలిగే అవకాశం ఉంటుంది. కాబట్టి తక్షణ రాజకీయ, పరిపాలనా అవసరాలకే పరిమితం కాకుండా వచ్చే ఐదు, పది సంవత్సరాల ఆర్థిక స్థిరత్వాన్ని దృష్టిలో పెట్టుకుని నిర్ణయాలు తీసుకోవాలి. చివరికి ఆరోగ్యకరమైన రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ అంటే ఉద్యోగులకు జీతాలు ఇవ్వగలగడం మాత్రమే కాదు. పింఛన్లు చెల్లించగలగాలి, అప్పులపై వడ్డీలు భరించగలగాలి, సంక్షేమాన్ని కొనసాగించగలగాలి, అదే సమయంలో రహదారులు, విద్య, వైద్యం, పరిశ్రమలు, మౌలిక వసతులపై పెట్టుబడులు పెట్టగలగాలి. ఆదాయం-వ్యయం-అప్పులు-పెట్టుబడుల మధ్య ఈ సమతుల్యత దెబ్బతినకుండా చూడటం ప్రభుత్వ ఆర్థిక నిర్వహణలో అత్యంత కీలకమైన బాధ్యత. ప్రస్తుత పరిస్థితి ఆ సమతుల్యతను మరింత జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన అవసరాన్ని స్పష్టం చేస్తోంది.

## ప్రజాస్వామ్యంపై ప్రశ్న

భారత ప్రజాస్వామ్యంలో ఎన్నికలు కేవలం ప్రభుత్వాలను ఎన్నుకునే ప్రక్రియ కాదు. ప్రజల సార్వభౌమాధికారాన్ని ఆచరణలోకి తీసుకువచ్చే అత్యంత కీలక వ్యవస్థ. అందుకే ఎన్నికల ప్రక్రియపై అనుమానం తలెత్తిన ప్రతిసారీ దాని ప్రభావం ఒక రాజకీయ పార్టీ లేదా ఒక ఎన్నికతో ముగియదు. అది ప్రజలకు ఎన్నికల వ్యవస్థపై ఉన్న విశ్వాసాన్ని తాకుతుంది. ప్రస్తుతం కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ లేవనెత్తుతున్న 'ఓట్ల దొంగతనం' ఆరోపణలు కూడా ఇలాంటి విస్తృతమైన చర్చకు దారితీశాయి. రాహుల్ గాంధీ చాలా కాలంగా ఎన్నికల వ్యవస్థలో అవకతవకలు జరుగుతున్నాయని ఆరోపిస్తున్నారు. తాజాగా ఎన్నికల సంఘంలోనే ఇద్దరు ఎన్నికల కమిషనర్లు కొన్ని నిర్ణయాలపై పదేపదే అభ్యంతరాలు వ్యక్తం చేశారంటూ వచ్చిన ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్ పరిశోధనాత్మక కథనాన్ని ఆయన తన వాదనకు కీలక ఆధారంగా ప్రస్తావించారు. ఆ కథనం ప్రకారం, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషి పది నెలల కాలంలో కనీసం 14 సార్లు కొన్ని నిర్ణయాలపై అభ్యంతరాలు వ్యక్తం చేశారు. కొత్త ఓటర్ల నమోదు కోసం ఫారం మార్పులు, ఓటర్ల పేర్ల తొలగింపు, ఎన్నికల డేటా వ్యవస్థ కేంద్రీకరణ వంటి అంశాలపై వారు ప్రశ్నలు లేవనెత్తినట్లు కథనం పేర్కొంది. ఈ పరిణామం రాజకీయంగా ఎందుకు ప్రాధాన్యం సంతరించుకుంది? కారణం చాలా సులభం. ఎన్నికల సంఘం ఒక సాధారణ ప్రభుత్వ శాఖ కాదు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 324 ఆధారంగా పనిచేసే స్వతంత్ర రాజ్యాంగ సంస్థ. ఓటర్ల జాబితా నుంచి పోలింగ్ వరకు, ఎన్నికల నిర్వహణ నుంచి ఫలితాల ప్రకటన వరకు దాని పాత్ర ప్రజాస్వామ్య వ్యవస్థకు కేంద్రబిందువు. అందువల్ల ఎన్నికల సంఘం నిర్ణయాలపై దాని అంతర్గత సభ్యులే అభ్యంతరాలు వ్యక్తం చేశారన్న వార్త సహజంగానే ప్రజా చర్చకు దారితీస్తుంది. అయితే ఇక్కడ ఒక ముఖ్యమైన తేడాను గుర్తించాలి. ఎన్నికల సంఘంలోని ఇద్దరు కమిషనర్లు కొన్ని నిర్ణయాలను ప్రశ్నించారన్నది ఒక విషయం. ఆ కారణంగా ఎన్నికల్లో 'ఓట్ల దొంగతనం' జరిగిందని తుది నిర్ణయానికి రావడం మరో విషయం. మధ్యలో ఆధారాలు, ప్రక్రియ, న్యాయపరమైన పరిశీలన, గణాంకాలు ఉంటాయి. ఇప్పటివరకు బయటకు వచ్చిన సమాచారం ఎన్నికల నిర్వహణపై తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తుతున్నప్పటికీ, అదే సమాచారాన్ని నేరుగా నిర్దిష్ట ఎన్నికల ఫలితాలు అక్రమంగా మార్చబడ్డాయని నిరూపణగా చూడటం వేరు. ఇదే అంశంలో ఎన్నికల సంఘం తనదైన వివరణ ఇచ్చింది. అంతర్గత చర్చల్లో భిన్నాభిప్రాయాలు సహజమని, చివరికి గత ఏడాది తీసుకున్న నిర్ణయాలన్నీ పూర్తి కమిషన్ ఏకగ్రీవ నిర్ణయాలేనని ఎన్నికల సంఘం పేర్కొంది. అంటే కమిషనర్ల మధ్య ప్రశ్నలు లేదా అభిప్రాయ భేదాలు ఉండటం, తుది నిర్ణయం రాజ్యాంగబద్ధమైన ప్రక్రియలో తీసుకోకపోవడం రెండూ ఒకటేనని చెప్పలేమన్నది ఈ వివరణలోని ప్రధాన అంశం. బీజేపీ కూడా రాహుల్ గాంధీ ఆరోపణలను తిరస్కరిస్తోంది. పార్టీ అధికార ప్రతినిధి సుధాన్షు త్రివేది, ఎన్నికల సంఘం ప్రక్రియ చట్టబద్ధమైనదేనని, నిర్ణయాలు మెజారిటీ ఆధారంగా తీసుకోబడుతున్నాయని పేర్కొన్నారు. అంతేకాకుండా కాంగ్రెస్ గత ఎన్నికల్లో ఎదుర్కొన్న పరాజయాలకు ఎన్నికల అక్రమాలను కారణంగా చూపడం రాజకీయంగా సరైన వివరణ కాదని బీజేపీ వాదిస్తోంది. ఇక్కడి నుంచి చర్చ మరో రాజకీయ ప్రశ్నవైపు మళ్లుతోంది 'యాంటీ ఇన్‌కంబెన్సీ' లేదా ప్రభుత్వ వ్యతిరేకత. రాహుల్ గాంధీ గతంలో ప్రజాదరణ గరిష్ఠ స్థాయిలో ఉన్న ప్రభుత్వాలు కూడా కొంతకాలానికే ప్రజల వ్యతిరేకతను ఎదుర్కొన్న ఉదాహరణలను ప్రస్తావిస్తూ, ప్రస్తుత రాజకీయ పరిస్థితిలో అలాంటి ప్రభావం ఎందుకు కనిపించడం లేదని ప్రశ్నిస్తున్నారు. ఇందిరాగాంధీ కాలాన్ని ఉదాహరణగా చూపుతున్నారు. అయితే ప్రభుత్వ వ్యతిరేకత అనేది స్థిరమైన రాజకీయ నియమం కాదు. అది రాష్ట్రం, కాలం, నాయకత్వం, సంక్షేమ పథకాలు, ఆర్థిక పరిస్థితులు, ప్రతిపక్షాల బలం, స్థానిక రాజకీయ సమీకరణాలు వంటి అనేక అంశాలపై ఆధారపడుతుంది. ఒక ఎన్నికలో అధికార పార్టీపై వ్యతిరేకత కనిపించకపోవడం మాత్రమే ఎన్నికల ప్రక్రియలో లోపం ఉందని నిరూపించదు. అదే విధంగా ప్రతిపక్షం బలహీనంగా ఉండటం మాత్రమే ఎన్నికల వ్యవస్థపై వచ్చిన ప్రశ్నలను కొట్టిపారేయడానికి సరిపోదు. రెండు అంశాలను వేర్వేరుగా పరిశీలించాల్సిందే. ఈ వివాదానికి మరో ముఖ్యమైన సామాజిక కోణం ఉంది. ఓటర్ల జాబితాలో ఒకరి పేరు లేకపోవడం కేవలం పరిపాలనా పొరపాటు కాదు. అది ఒక పౌరుడి ఎన్నికల హక్కును ప్రత్యక్షంగా ప్రభావితం చేయగల అంశం. ప్రస్తుతం స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియలో ఓటర్ల పేర్ల తొలగింపు, చేర్పు, అప్పీళ్లకు సంబంధించిన అంశాలపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. పశ్చిమ బెంగాల్‌లో తొలగించబడిన 27.16 లక్షల మంది ఓటర్లలో 22 లక్షలకు పైగా పునరుద్ధరణ కోసం అప్పీల్ చేశారని ఎన్నికల సంఘం సుప్రీంకోర్టుకు తెలిపింది. అదే సమయంలో తొలగింపుల్లో మరణించిన వారు, వలస వెళ్లిన వారు, డూప్లికేట్ పేర్లు వంటి కారణాలు ఉన్నాయని కూడా కమిషన్ పేర్కొంది. ఇక్కడే ప్రజాస్వామ్య వ్యవస్థకు అసలు సవాలు కనిపిస్తుంది. ఓటర్ల జాబితాను శుద్ధి చేయడం అవసరం. నకిలీ, డూప్లికేట్ లేదా అర్హత లేని పేర్లను తొలగించడం కూడా ఎన్నికల స్వచ్ఛతకు అవసరమే. కానీ ఆ ప్రక్రియలో అర్హత ఉన్న ఒక్క ఓటరు కూడా అనవసరంగా తన ఓటు హక్కును కోల్పోకుండా చూడటం అంతే ముఖ్యం. అంటే ఎన్నికల జాబితా 'శుభ్రంగా' ఉండటం మాత్రమే కాదు.. అది 'సంపూర్ణంగా, న్యాయంగా' ఉండటం కూడా అవసరం. ఎన్నికల సంఘంలోని అంతర్గత అభ్యంతరాలు ఈ చర్చను మరింత తీవ్రమయ్యేలా చేశాయి. ముఖ్యంగా ఎన్నికల డేటా, సాఫ్ట్‌వేర్ నియంత్రణ, స్థానిక ఎన్నికల అధికారుల నిర్ణయాలకు కేంద్ర స్థాయి వ్యవస్థల ప్రభావం వంటి అంశాలపై ప్రశ్నలు లేవనెత్తడం వల్ల సాంకేతిక పారదర్శకత కూడా రాజకీయ పారదర్శకతతో సమానంగా ముఖ్యమైందని స్పష్టమవుతోంది. అయితే ఈ పరిణామాలను ఆధారంగా చేసుకుని వెంటనే ఎన్నికల ఫలితాలన్నింటినీ అనుమానించడం కూడా సరైన మార్గం కాదు. ఒక వ్యవస్థలో పరిపాలనా లోపాలు ఉన్నాయా? నిర్ణయ ప్రక్రియలో పారదర్శకత ఉందా? అభ్యంతరాలకు సమాధానాలు ఇచ్చారా? అర్హత ఉన్న ఓటర్లు తొలగించబడ్డారా? తొలగించబడితే వారిని పునరుద్ధరించేందుకు సమర్థవంతమైన వ్యవస్థ ఉందా? ఇవే ముందుగా పరిశీలించాల్సిన ప్రశ్నలు. రాహుల్ గాంధీ రాజకీయంగా అత్యంత తీవ్రమైన పదజాలంతో ఎన్నికల వ్యవస్థపై ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. బీజేపీ అదే స్థాయిలో రాజకీయంగా ప్రతివాదం చేస్తోంది. కానీ ఈ రెండు వాదనల మధ్య ప్రజలకు అవసరమైనది మరొకటి స్పష్టమైన, పత్రాధారిత సమాధానాలు. ఆరోపణలు ఉంటే వాటికి ఆధారాలు బయటకు రావాలి. అభ్యంతరాలు ఉంటే వాటిపై ఎన్నికల సంఘం పాయింట్-బై-పాయింట్ వివరణ ఇవ్వాలి. అవసరమైతే న్యాయపరమైన పరిశీలన జరగాలి. ఎందుకంటే ప్రజాస్వామ్యంలో ఎన్నికల సంఘంపై విశ్వాసం అధికార పక్షానికో, ప్రతిపక్షానికో సంబంధించిన అంశం కాదు. అది ప్రతి ఓటరుకు సంబంధించిన విషయం. ఈ సంస్థపై నమ్మకం బలహీనపడితే ఎన్నికల్లో గెలిచినవారి చట్టబద్ధతపైనా, ఓడినవారి అంగీకారంపైనా, చివరికి ప్రజాస్వామ్య వ్యవస్థపైనే ప్రశ్నలు తలెత్తే అవకాశం ఉంటుంది. అందుకే ప్రస్తుత వివాదాన్ని కేవలం 'రాహుల్ వర్సెస్ బీజేపీ' రాజకీయ పోరాటంగా చూడటం సరిపోదు. ఇది ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, ఓటర్ల జాబితాల విశ్వసనీయత, రాజ్యాంగ సంస్థల స్వతంత్రత, డిజిటల్ ఎన్నికల మౌలిక సదుపాయాల భద్రత, పౌరుల ఓటు హక్కు వంటి అనేక అంశాలను ఒకేసారి ముందుకు తెచ్చిన పరిణామం. చివరికి ప్రజాస్వామ్యానికి అత్యంత ముఖ్యమైనది ఎవరు గెలిచారు అనేది మాత్రమే కాదు.. ప్రజలు తమ ఓటు నిజంగా లెక్కించబడిందని నమ్ముతున్నారా అన్నది. రాజకీయ పార్టీలు మారుతాయి. ప్రభుత్వాలు వస్తాయి, పోతాయి. నాయకులపై ప్రజల అభిప్రాయాలు మారుతాయి. కానీ ఓటుపై విశ్వాసం మాత్రం వ్యవస్థకు పునాది. అందుకే 'ఓట్ల దొంగతనం' అనే రాజకీయ ఆరోపణకు తుది సమాధానం నినాదాల్లో రాదు. ఆధారాల్లో రావాలి. రాజకీయ ప్రసంగాల్లో కాదు.. పారదర్శక ప్రక్రియలో రావాలి. ప్రజల అనుమానాలను కొట్టిపారేయడం ద్వారా కాదు.. వాటికి సమాధానాలు ఇవ్వడం ద్వారా ఎన్నికల వ్యవస్థపై విశ్వాసం బలపడుతుంది. అదే సమయంలో ఆధారాలు లేని ఆరోపణలను నిజాలుగా స్వీకరించకుండా, వాస్తవాలను స్వతంత్రంగా పరిశీలించడం కూడా ప్రజాస్వామ్య పౌర బాధ్యతే. ఎన్నికల సంఘం తన నిర్ణయాలను ఎంత పారదర్శకంగా వివరిస్తే అంత మంచిది. రాజకీయ పార్టీలు తమ ఆరోపణలను ఎంత బలమైన ఆధారాలతో ముందుకు తెస్తే అంత మంచిది. చివరికి ఈ వ్యవస్థకు యజమానులు రాజకీయ పార్టీలు కాదు ఓటర్లు. వారి ఓటుపై విశ్వాసం నిలిచినంతకాలం ప్రజాస్వామ్యం బలంగా ఉంటుంది.

## భవిష్యత్ తరాల భవితవ్యంపై ప్రశ్న




సాంకేతికత మనిషి జీవితాన్ని మార్చిన వేగం గతంలో ఎన్నడూ చూడనిది. ముఖ్యంగా సోషల్ మీడియా ప్రపంచాన్ని మన చేతుల్లోకి తీసుకొచ్చింది. సమాచారం తెలుసుకోవడం, అభిప్రాయాలను పంచుకోవడం, కొత్త విషయాలను నేర్చుకోవడం, ప్రపంచంతో అనుసంధానం కావడం వంటి ఎన్నో అవకాశాలను సోషల్ మీడియా అందిస్తోంది. అయితే ఇదే వేదికను నియంత్రణ లేకుండా ఉపయోగిస్తే భవిష్యత్ తరాల ఆలోచనా విధానం, సామాజిక సంబంధాలు, మానసిక స్థితిపై తీవ్ర ప్రభావం చూపే అవకాశం ఉంది. ప్రస్తుత తరంలో పిల్లలు, యువత చిన్న వయసులోనే సోషల్ మీడియాకు పరిచయమవుతున్నారు. మొబైల్ ఫోన్ చేతిలోకి వచ్చిన వెంటనే సోషల్ మీడియా ప్రపంచం వారి ముందుకు వస్తోంది. చిన్న వీడియోలు, గేమింగ్, నిరంతర నోటిఫికేషన్లు, వైరల్ కంటెంట్ వంటి అంశాలు వారి దృష్టిని ఎక్కువసేపు ఆకర్షిస్తున్నాయి. ఫలితంగా ఒక విషయంపై ఎక్కువ సమయం దృష్టి పెట్టడం, పుస్తకాలు చదవడం, సృజనాత్మకంగా ఆలోచించడం వంటి అలవాట్లు క్రమంగా తగ్గే ప్రమాదం ఉంది. సోషల్ మీడియా మరో ప్రభావం సామాజిక పోలిక. ఇతరుల విజయాలు, ఖరీదైన జీవనశైలి, అందం, ప్రయాణాలు వంటి అంశాలను నిరంతరం చూసే యువత తమ జీవితాన్ని వాటితో పోల్చుకునే పరిస్థితి ఏర్పడుతోంది. సోషల్ మీడియాలో కనిపించేది పూర్తిస్థాయి వాస్తవం కాదనే విషయాన్ని అర్థం చేసుకోలేకపోతే అసంతృప్తి, ఆత్మన్యూనత భావాలు పెరగవచ్చు. అదే సమయంలో సైబర్ బుల్లీయింగ్, తప్పుడు సమాచారం, ద్వేషపూరిత కంటెంట్, ఆన్‌లైన్ మోసాలు కూడా యువతకు సవాళ్లుగా మారుతున్నాయి. అయితే సోషల్ మీడియాను పూర్తిగా ప్రతికూలంగా చూడటం కూడా సరైనది కాదు. ప్రపంచవ్యాప్తంగా విద్యా వనరులు, నైపుణ్య శిక్షణ, ఉపాధి అవకాశాలు, సామాజిక అవగాహన, అత్యవసర సమాచారాన్ని వేగంగా చేరవేయడంలో ఇది కీలక పాత్ర పోషిస్తోంది. ఒక గ్రామంలోని విద్యార్థి ప్రపంచంలోని ప్రముఖ విద్యా వనరులను యాక్సెస్ చేయగలగడం సోషల్ మీడియా, డిజిటల్ ప్రపంచం కల్పించిన అవకాశమే. కాబట్టి సమస్య సోషల్ మీడియాలో లేదు.. దాని వినియోగ విధానంలో ఉంది. పిల్లలకు కేవలం మొబైల్ ఇవ్వడం కాదు, దాన్ని బాధ్యతగా ఎలా ఉపయోగించాలో నేర్పించాలి. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం కలిసి డిజిటల్ అవగాహన పెంచాలి. పాఠశాల స్థాయి నుంచే సైబర్ భద్రత, తప్పుడు సమాచారాన్ని గుర్తించడం, వ్యక్తిగత సమాచారాన్ని రక్షించుకోవడం వంటి అంశాలపై అవగాహన అవసరం. భవిష్యత్ తరాలు సాంకేతికతను ఉపయోగించాలి.. సాంకేతికతకు బానిసలు కాకూడదు. సోషల్ మీడియా మనిషి ఆలోచనలను విస్తరించే సాధనంగా ఉండాలి కానీ ఆలోచించే శక్తిని భర్తీ చేసే వ్యవస్థగా మారకూడదు. రాబోయే తరాల భవిష్యత్తును నిర్ణయించేది టెక్నాలజీ ఎంత వేగంగా అభివృద్ధి చెందుతుందన్నది కాదు.. దాన్ని మనం ఎంత బాధ్యతగా ఉపయోగిస్తామన్నదే.

# నయీం ఆస్తులన్నీ భద్రంగా ఉన్నాయా?

- 327 ఆస్తులు 22 ఏ(1),(ఈ)లో చేర్చాలని గతేడాది జీవో, ఆపై గెజిట్
- కానీ, కొన్నింటినే అప్‌లోడ్ చేసిన రెవెన్యూ అధికారులు
- 22 ఏ(1),(ఈ)లో కనిపించని తూప్రాన్‌పేట ల్యాండ్
- ఈడీ కేసులో ఉన్నందున రిజిస్ట్రేషన్ కు సబ్ రిజిస్ట్రార్ నిరాకరణ
- సీసీఎల్ఏకు చేరిన వివాదం ఆదివారం పొద్దున 7.45కు 5.5
- ఎకరాల డిటైల్స్ అప్‌లోడ్, కనిపించని 40 ఎకరాల సర్వే నంబర్



**యాదాద్రి,ఫ్లాష్ ఇండియా :** ఎన్‌కౌంటర్‌లో మరణించిన గ్యాంగ్‌స్టర్ నయీం ఆస్తులపై చాన్నాళ్ల తర్వాత చర్చ మొదలైంది. యాదాద్రి జిల్లా తూప్రాన్‌పేట భూ రిజిస్ట్రేషన్ వివాదంతో ప్రొహిబిటెడ్ లిస్ట్‌లో చేర్చిన నయీం ఆస్తులన్నీ భద్రంగా ఉన్నాయా? చేతులు మారాయా? అన్న అనుమానాలు కలుగుతున్నాయి. గ్యాంగ్‌స్టర్ నయీం బెదిరింపులు, అరాచకాలతో అత్యంత విలువైన భూములను కూడబెట్టుకున్నాడు. యాదాద్రితో సహా పలు జిల్లాల్లో ఉన్న ఈ భూములను తన భార్య, బంధువులు, అనుచరుల పేర్లతో రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. 8 ఆగస్టు 2020న జరిగిన ఎన్‌కౌంటర్‌లో నయీం మరణించాడు. ఆ తర్వాత నయీం కూడబెట్టిన ఆస్తులపై సిట్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ), ఇతర దర్యాప్తు సంస్థల కేసుల కారణంగా ప్రొహిబిటెడ్‌లో చేరాయి.

**327 ఆస్తులపై జీవో**

నయీం తమ ఆస్తులను బెదిరించి లాక్కున్నాడని అనేక మంది పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పాటు కోర్టులను ఆశ్రయించారు. దీంతో ప్రభుత్వం నయీంకు చెందిన 327 ఆస్తులను 22ఏ(1),(ఇ)లో చేర్చాలని ఆదేశాలు జారీ చేసింది. నయీంకు సంబంధించి యాదాద్రి జిల్లాలో 200కు పైగా ఆస్తులు ఉండగా, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో వంద వరకూ ఆస్తులు ఉన్నాయి. మిగిలినవి నల్గొండ, ఖమ్మం, కరీంనగర్, జగిత్యాల, రంగారెడ్డి, సిద్దిపేట, మెదక్, మహబూబ్‌నగర్, పెద్దపల్లి జిల్లాల్లో ఉన్నాయి. ఈ వివరాలను ఆయా జిల్లాల కలెక్టర్లకు పంపి వాటిని రిజిస్ట్రేషన్ చేయకుండా నిషేధిస్తూ జీవో నంబర్ 206 విడుదల చేసిన ప్రభుత్వం ఆతర్వాత 149 నంబర్ గెజిట్ విడుదల చేసింది.

**గెజిట్ జారీ చేసినా..**

ప్రభుత్వం జారీ చేసిన గెజిట్‌లో పేర్కొన్న ఆస్తుల వివరాలను రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్ డిపార్ట్‌మెంట్ వెబ్‌సైట్‌లోని ప్రొహిబిటెడ్ కాలంలో అగ్రికల్చర్, నాన్ అగ్రికల్చర్ కాలాల్లో పేర్కొనాల్సి ఉంటుంది. ఈ మేరకు యాదాద్రి జిల్లా భువనగిరిలోని ఆస్తుల వివరాలను 22 ఏ(1), (ఇ)లో అప్‌లోడ్ చేశారు. కానీ, చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేటలో ఉన్న పలు ఆస్తుల వివరాలను చేర్చలేదు. దీంతో ఈ ఆస్తులపై కన్నేసిన కొందరు వ్యక్తులు ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి ప్రయత్నించారు. సర్వే నంబర్ 13 ఏ, సర్వే నంబర్ 14లోని 5.5 ఎకరాల భూమిలోని ఖాళీ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేయాలంటూ శుక్రవారం చౌటుప్పల్ రిజిస్ట్రేషన్ ఆఫీసుకు వెళ్లారు. అయితే ఈ భూమి ఫిజికల్‌గా ఖాళీ ప్లాట్లుగా ఉండగా రికార్డుల్లో మాత్రం అగ్రికల్చర్ ల్యాండ్‌గానే ఉంది. ఈడీ కేసుల కారణంగా రిజిస్ట్రేషన్ చేయలేమని రిజిస్ట్రార్ చెప్పినా. వారు వినకుండా వాదనకు దిగారు. తహసీల్దార్ ఆఫీస్‌లో తాము కనుక్కున్నామని, రికార్డుల్లోనూ ఈ భూములు నిషేధిత జాబితాలో లేవని వాదించడంతో సబ్ రిజిస్ట్రార్ ఈ విషయాన్ని సీసీఎల్ఏ దృష్టికి తీసుకెళ్లారు. ఈ అంశంపై వివరణ కోరుతూ సీసీఎల్ఏ నుంచి జిల్లా అధికారులకు ఆదేశాలు అందాయి.

**ఆదివారం పొద్దుగాల 7.45కు అప్‌లోడ్**

గెజిట్‌లో పేర్కొన్న ఆస్తులను ప్రొహిబిటెడ్ లిస్ట్‌లో ఎందుకు పెట్టలేదని చౌటుప్పల్ తహసీల్దార్ వీరాబాయికి శుక్రవారం రాత్రి అధికారులు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఈ అంశం వివాదం కావడంతో యాదాద్రి జిల్లా రెవెన్యూ ఆఫీసర్లు శనివారం రాత్రంతా కష్టపడి రెండు సర్వే నంబర్లలోని 5.5 ఎకరాలను ఆదివారం పొద్దుగాల 7.45 గంటలకు ప్రొహిబిటెడ్ సైట్‌లో అప్‌లోడ్ చేశారు. కానీ, మరో సర్వే నంబర్‌లో ఉన్న దాదాపు 40 ఎకరాలు ఇప్పటికీ అప్‌లోడ్ చేయలేదని తెలుస్తోంది. ఈ భూమికి సంబంధించి సిట్ నుంచి ఎన్వోసీ వచ్చిందని కొందరు ఆఫీసర్లు అంటున్నారు. నిజంగానే దర్యాప్తు సంస్థల క్లియరెన్స్ తర్వాతే చేతులు మారిందా? అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అయితే.. 40 ఎకరాలు ప్రొహిబిటెడ్ సైట్‌లో కోర్టు కేసుల కాలమ్‌లో కనిస్తున్నాయి. చౌటుప్పల్ మండలం తూప్రాన్‌పేటలోని భూమి అధికారుల నిర్లక్ష్యం వల్ల 22( ఏ) లిస్ట్‌లో చేరలేదా? కావాలనే ఎవరైనా లిస్ట్‌లో చేర్చకుండా అడ్డు పడ్డారా? అన్న చర్చ సాగుతోంది. మిగిలిన 9 జిల్లాల్లోని నయీం ఆస్తులపైనా సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

# మాజీ మంత్రి చుట్టూ బిగుస్తున్న ఉచ్చు!

**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** రాష్ట్ర పౌరసరఫరాల శాఖలో ఏళ్లుగా సాగిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) వ్యవహారంలో రోజురోజుకూ కొత్త అంశాలు వెలుగులోకి వస్తున్నాయి. ప్రభుత్వ ధాన్యాన్ని మిల్లర్లకు అప్పగించి, మిల్లింగ్ అనంతరం నిర్దేశిత పరిమాణంలో బియ్యాన్ని ప్రభుత్వానికి అప్పగించాల్సిన వ్యవస్థలో భారీగా తేడాలు ఎలా చోటుచేసుకున్నాయన్నది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. ప్రస్తుత విజిలెన్స్ పరిశీలనలు, రికవరీ ప్రక్రియల నేపథ్యంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సీఎంఆర్ వ్యవహారాన్ని ఎలా పర్యవేక్షించారు? కేంద్ర సంస్థలు లేవనెత్తిన అనుమానాలపై అప్పట్లో ఎందుకు కఠినంగా వ్యవహరించలేదు? అన్న ప్రశ్నలు బలంగా వినిపిస్తున్నాయి. కాగా.. 2022లో ఎఫ్‌సీఐ చేపట్టిన ప్రైమరీ తనిఖీల్లో రాష్ట్రంలోని 40 రైస్ మిల్లుల్లో 4,53,896 బస్తాల ధాన్యం కొరత గుర్తించినట్టు కేంద్రం అధికారికంగా వెల్లడించింది. ఈ కొరత 18,156 టన్నులకు సమానమని అప్పట్లో కేంద్రం తెలిపింది. మరో విడతలో 63 మిల్లుల్లో 1,37,872 బస్తాల కొరత కూడా గుర్తించినట్టు కేంద్రం పేర్కొంది. అంతేకాదు.. వందలాది మిల్లుల్లో ధాన్యం లెక్కించేందుకు వీలులేని విధంగా నిల్వలు ఉండటం, సరైన రికార్డులు నిర్వహించకపోవడం వంటి అంశాలను కూడా కేంద్ర బృందాలు గుర్తించినట్టు అధికారిక ప్రకటనల్లో నమోదైంది. కానీ, అప్పటిప్రభుత్వం, పౌరసరఫరాల శాఖ మంత్రి పెద్దగా లెక్కచేయలేదని సమాచారం.

**నాడే హెచ్చరిక.. అయినా లైట్**

ఎఫ్‌సీఐ భౌతిక తనిఖీల్లో తేడాలు బయటపడిన సమయంలోనే సంబంధిత మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని కేంద్రం రాష్ట్రాన్ని కోరినట్టు సమాచారం. అయితే, చర్యలు తీసుకోవడంలో జాప్యం జరిగిందని కేంద్రం అప్పట్లో బహిరంగంగానే పేర్కొంది. చివరకు కేంద్ర పూల్‌కు బియ్యం సేకరణను తాత్కాలికంగా నిలిపివేసే పరిస్థితి కూడా ఏర్పడింది. అదే సమయంలో.. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలోని అప్పటి పౌరసరఫరాల శాఖ మాజీ మంత్రి ఎఫ్‌సీఐ తనిఖీలపై అభ్యంతరాలు వ్యక్తం చేసినట్టు తెలిసింది. ఎఫ్‌సీఐకి మిల్లుల్లోని ధాన్యం నిల్వలను తనిఖీ చేసే అధికార పరిధిపైనా ఆయన ప్రశ్నలు లేవనెత్తారని సమాచారం. ఇప్పుడు అదే అంశం కొత్త ప్రశ్నలకు దారితీస్తోంది. నాడు తనిఖీలు పూర్తిస్థాయిలో జరిగి.. ప్రతి బస్తా లెక్క తేల్చి.. లోటుపాట్లపై కఠిన చర్యలు తీసుకుని ఉంటే పరిస్థితి ఇంత దూరం వచ్చేదా? అన్నదే అసలు ప్రశ్నగా మారింది.

**4.53 లక్షల బస్తాలు కొరత**

40 రైస్ మిల్లుల్లో తనిఖీ చేయగా 4.53 లక్షల బస్తాల కొరత ఉన్నట్టు కేంద్రం గుర్తించింది. ఆ తర్వాత వ్యవహారం ఎలా ముగిసింది? ఎంత మొత్తాన్ని రికవరీ చేశారు? ఎంతమంది మిల్లర్లపై కేసులు నమోదయ్యాయి? ఎవరెవరిపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు? అప్పట్లో తేలిన కొరతలో ఎంత మొత్తం వాస్తవంగా ప్రభుత్వ ఖాతాలోకి తిరిగి వచ్చింది? అనే వివరాలు ఇప్పుడు కీలకంగా మారాయి. అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన తదుపరి తనిఖీల్లో ఎఫ్‌సీఐ గుర్తించిన లోటుపాట్లలో గణనీయమైన తేడాలు లేవని వాదనలు వచ్చినట్లు కూడా వార్తలు వెలువడ్డాయి. అప్పటి మంత్రి కూడా ఎఫ్‌సీఐ గుర్తించిన 40 మిల్లుల తేడాలపై వివరణ ఇస్తూ, రాష్ట్రం-ఎఫ్‌సీఐ సంయుక్త తనిఖీల్లో 10 మిల్లుల్లోనే అక్రమాలు గుర్తించామని పేర్కొన్నారు. ధాన్యం సేకరణ వ్యవహారంలో రైతులకు ఇబ్బందులు కలగకూడదనే కారణంతో తనిఖీలు, చర్యలపై అభ్యంతరాలు వ్యక్తం చేశారని తెలిసింది. అయితే, చివరకు ఆ ధాన్యం ప్రభుత్వ ఆస్తి కాదా? రైతుల నుంచి సేకరించిన ధాన్యానికి ప్రభుత్వమే బాధ్యత వహించదా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. రైతుల ప్రయోజనాలను తాకట్టుపెట్టి అప్పటి మంత్రి మిల్లర్లకు వెసులుబాటు కల్పించారా? తనిఖీల పేరుతో రైతులను ఇబ్బంది పెడుతున్నారన్న వాదనను మిల్లర్ల రక్షణకు ఉపయోగించారా? అనే వాదన వినిపిస్తున్నది.

**సీఎంఆర్ లెక్కల్లో అంతులేని గందరగోళం!**

ధాన్యం మిల్లుకు చేరిన తర్వాత ఎంత స్టాక్ ఉంది? ఎంత మిల్లింగ్ చేశారు? ఎంత బియ్యం ప్రభుత్వానికి అప్పగించారు? ఎంత బకాయి ఉంది? ఎన్ని సీజన్లకు సంబంధించిన సీఎంఆర్ పెండింగ్‌లో ఉంది? అనే లెక్కలే ఇప్పుడు అసలు కీలకం. కేంద్ర ప్రభుత్వ అధికారిక పోర్టల్‌లో కూడా మిల్లుల వారీగా సీఎంఆర్ డెలివరీ, మిల్లర్లకు కేటాయించిన ధాన్యం, పెండింగ్ వివరాలను ట్రాక్ చేసే వ్యవస్థ ఉన్నది. ఇన్ని లెక్కలు, తనిఖీలు, రికార్డులు ఉన్నా భారీ మొత్తంలో సీఎంఆర్ బకాయిలు ఎలా పేరుకుపోయాయి? ఎవరి పర్యవేక్షణలో ఈ వ్యవస్థ పనిచేసింది? అన్నదే ఇప్పుడు పెద్ద ప్రశ్న. ప్రస్తుత విజిలెన్స్ విచారణల్లో రాష్ట్రవ్యాప్తంగా భారీ మొత్తంలో సీఎంఆర్ బియ్యం రికవరీ కాకుండా ఉన్న అంశం పరిశీలనలోకి వచ్చినట్లు రాష్ట్ర రాజకీయ, అధికార వర్గాల్లో చర్చ జరుగుతున్నది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పౌరసరఫరాల శాఖ, విజిలెన్స్ విభాగాలు సంయుక్తంగా చేపట్టిన ఆడిట్‌లో దిగ్భ్రాంతికర నిజాలు వెలుగుచూశాయి. గత బీఆర్ఎస్ పాలన కాలంలో ప్రభుత్వ ధాన్యాన్ని బహిరంగ మార్కెట్లో అమ్ముకోవడం, పీడీఎస్ బియ్యాన్ని రీసైక్లింగ్ చేయడం వంటి చీకటి వ్యాపారం యథేచ్ఛగా సాగిందని తేలింది. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన నాటి నుంచి ఇప్పటివరకు సుమారు రూ.13 వేల కోట్ల విలువైన సీఎంఆర్ బియ్యం రికవరీ కాకుండా పేరుకుపోయిందని, ఇందులో సింహభాగం గత ప్రభుత్వ హయాంలోనే జరిగిందని దర్యాప్తు అధికారులు గుర్తించారు. నాడు ఎఫ్‌సీఐ హెచ్చరించినప్పుడే కఠినంగా వ్యవహరించి ఉంటే ఖజానాకు వేల కోట్ల నష్టం వాటిల్లేది కాదని అధికారులు స్పష్టం చేస్తున్నారు. డిఫాల్ట్ అయిన మిల్లర్ల నుంచి ఆస్తుల జప్తు ద్వారా రికవరీలు చేపడుతున్న ప్రభుత్వం.. ఈ మిల్లింగ్ మాఫియా వెనుక నాటి మంత్రులు, ఉన్నతాధికారుల పాత్రపై సమగ్ర విచారణ జరిపేందుకు సిద్ధమవుతుండటంతో రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

**అప్పుడే రికవరీ చేసి ఉంటే..**

2022లోనే ఎఫ్‌సీఐ తనిఖీల్లో కొరతలు బయటపడ్డాయి. కేంద్రం రాష్ట్రానికి చర్యలు తీసుకోవాలని సూచించింది. అయినా, పూర్తిస్థాయిలో కఠిన చర్యలు జరగలేదని కేంద్రం అప్పట్లో ఆరోపించింది. అప్పుడు తేలిన లోటుపాట్లపై సమగ్ర విచారణ జరిగి ఉంటే.. డిఫాల్ట్ మిల్లర్ల నుంచి సకాలంలో రికవరీ చేసి ఉంటే.. తదుపరి సీజన్లలోనూ ఇదే పరిస్థితి పునరావృతం కాకుండా అడ్డుకట్ట వేసి ఉంటే.. ఇప్పుడు రూ.వేల కోట్ల విలువైన సీఎంఆర్ వ్యవహారం విచారణ దశకు వచ్చేదా? అనే చర్చ శాఖలో నడుస్తున్నది. సీఎంఆర్ వ్యవహారంలో కేవలం మిల్లర్లను మాత్రమే బాధ్యులుగా చూపిస్తే పూర్తి చిత్రం బయటకు రాదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ధాన్యం కేటాయింపు నుంచి మిల్లింగ్, స్టాక్ వెరిఫికేషన్, బియ్యం అప్పగింత, బిల్లులు, బకాయిల రికవరీ వరకు ప్రతిదశలో ఎవరి బాధ్యత ఎంత? ఎక్కడ పర్యవేక్షణ లోపించింది? ఎవరు నిర్లక్ష్యం చేశారు? ఎవరికి లబ్ది చేకూరింది? అన్నది తేలాల్సి ఉంది.

# గన్ను నుంచి పెన్ను వైపు..!





**ఛత్తీస్‌గఢ్ :** జనజీవన స్రవంతిలోకి వస్తున్న మాజీ మావోయిస్టులు చదువు ద్వారా తమ కొత్త జీవితానికి బాటలు వేసుకుంటున్నారు. 'గన్ను నుంచి పెన్ను వైపు' అడుగులు వేస్తూ వారు సాధిస్తున్న అసాధారణ విజయాలు సమాజంలో నూతనోత్సాహాన్ని నింపుతున్నాయి. తాజాగా ఛత్తీస్‌గఢ్‌లో పదో తరగతి పరీక్షలు రాసిన మాజీ మావోయిస్టుల్లో 'వేసు' అనే ఆదివాసీ కామ్రేడ్ అందరికంటే ఎక్కువ మార్కులు సాధించి అగ్రస్థానంలో నిలిచారు. సమాజంలో గౌరవప్రదంగా బతకాలన్నా, ఉపాధి పొందాలన్నా కనీస విద్యార్హతలు ఎంతో అవసరమని గ్రహించిన పలువురు మాజీలు ఆ దిశగా వడివడిగా అడుగులు వేస్తున్నారు. పునరావాస క్యాంపుల్లో శిక్షణ పొందాలన్నా ఈ అర్హతలు తప్పనిసరి కావడంతో వారు కష్టపడి చదివి విజయం సాధిస్తున్నారు.

**ఒక్కొక్కరి విజయాలు ఇలా..**

**సునీల్ (హర్యానా/ఒడిశా):** ఒడిశా ఉదంతి ఏరియాలో డీవీసీఎంగా పని చేసి గరియాబంద్‌లో లొంగిపోయిన హర్యానాకు చెందిన సునీల్ చౌరవతో 2026 మార్చిలో పదో తరగతి పరీక్ష రాసి మొదటి శ్రేణిలో ఉత్తీర్ణుడయ్యారు. ఆయన స్ఫూర్తితో మరికొందరు కూడా అక్కడే పరీక్షల్లో ఉత్తీర్ణులయ్యారు.

**డాక్టర్ చంపా:** అనేక దశాబ్దాలుగా ప్రజా వైద్యురాలిగా, గెరిల్లాల విశ్వాసాన్ని చూరగొన్న ఆదివాసీ కామ్రేడ్ చంపా.. బయట నర్సుగా ప్రజా వైద్య సేవలు అందించడానికి 12వ తరగతి సర్టిఫికేట్ తప్పనిసరైంది. నాయకత్వం ప్రోత్సాహంతో ఆమె ఆగస్టులో పదో తరగతి పరీక్ష రాసి ఫస్ట్ క్లాస్‌లో పాసయ్యారు. ప్రస్తుతం ఆమె 12వ తరగతికి సిద్ధమవుతున్నారు.

**దూల మడ్కాం (ఛత్తీస్‌గఢ్/తెలంగాణ):** తెలంగాణలో లొంగిపోయిన ఛత్తీస్‌గఢ్ కామ్రేడ్ దూలా దినకూలీగా జీవిక సాగిస్తూనే పదో తరగతి పరీక్ష రాసి ద్వితీయ శ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. ఆయన కూడా ఇప్పుడు 12వ తరగతికి సన్నద్ధమవుతున్నారు.

**ఓపెన్ స్కూల్ ఓ వరం..**

ఛత్తీస్‌గఢ్ ఓపెన్ స్కూల్ సిస్టమ్ దాదాపు 20 సంవత్సరాల క్రితం ప్రారంభమైంది. ఇందులో కనీస విద్యార్హతలు లేకపోయినా, వయసు సరిపోయి ఆధార్ కార్డు ఉంటే నేరుగా పరీక్షలు రాసే వెసులుబాటు ఉంది. అయితే, మాజీ మావోయిస్టుల విద్యా యజ్ఞానికి పోలీసులు కూడా పూర్తి స్థాయిలో ప్రోత్సహిస్తుండటం విశేషం. ఉద్యమ జీవితాల నుంచి బయటకొచ్చి కొత్త మార్గాన్ని ఎంచుకుంటున్న వారికి ఉపాధ్యాయులు సైతం విద్యార్థుల్లా చేయి పట్టి నడిపిస్తున్నారు. ఇక ఇంతమంది విజయాలు ఇచ్చిన ఆత్మవిశ్వాసంతో రాబోయే డిసెంబర్ నెలలో జరగనున్న పరీక్షల్లో మరింత మంది మాజీ మావోయిస్టులు పాల్గొనేందుకు రెడీ అవుతున్నారు. చదువు ద్వారా తమ భవిష్యత్తును తీర్చిదిద్దుకుంటున్న వారికి సర్వత్రా అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.



## వైద్య రంగంలో అద్భుతం

**అహ్మదాబాద్,ఫ్లాష్ ఇండియా :** భారత వైద్య రంగంలో మరొక అద్భుతం ఆవిష్కృతమైంది. అహ్మదాబాద్ కు చెందిన 11 ఏళ్ల చిన్నారిని వేధిస్తున్న ప్రాణాంతక సమస్యకు వైద్యులు విజయవంతంగా శస్త్రచికిత్స చేసి కొత్త జీవితాన్ని ప్రసాదించారు. గుండె కుడివైపునకు మారడం, ఏకంగా 3 కేజీల బరువున్న భారీ కణితిని తొలగించడం వైద్యవర్గాల్లో సంచలనంగా మారింది.

**గుండె స్థానంలో మార్పు..**

ఓ చిన్నారి చాలా కాలంగా అలసట, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులతో బాధపడుతుండగా, వైద్య పరీక్షల్లో గుండె సాధారణ స్థానం కంటే కుడివైపునకు మారినట్లుగా తేలింది. ఎక్స్-రే, సీటీ స్కాన్ ద్వారా పరిశీలించగా.. ఛాతీలో సుమారు 23 సెం.మీ పరిమాణంతో ఏకంగా 3 కేజీల బరువున్న భారీ కణితి ఉన్నట్లుగా వైద్యులు గుర్తించారు. ఈ భారీ కణితి కారణంగా ఊపిరితిత్తులపై తీవ్ర ఒత్తిడి పడి రక్తస్రావం కావడం, డయాఫ్రమ్ పూర్తిగామారింది.

**అతి క్లిష్టమైన శస్త్రచికిత్స..**

ప్రముఖ సర్జన్ డాక్టర్ మహేష్ డి.పటేల్ నేతృత్వంలోని వైద్య బృందం క్లామ్‌షెల్ అనే అరుదైన ఇన్సిషన్ పద్ధతిని ఉపయోగించి, కేవలం 3 గంటల్లోనే ఎంతో క్లిష్టమైన ఈ సర్జరీని విజయవంతంగా పూర్తి చేసింది. కణితిని తొలగించిన వెంటనే ఊపిరితిత్తులు సాధారణ స్థితికి వచ్చాయి. క్రమంగా గుండె కూడా తన సహజ స్థానానికి చేరుకోవడంతో, వారం రోజుల్లోనే చిన్నారి సంపూర్ణ ఆరోగ్యంతో డిశ్చార్జ్ అయ్యారు.



# సీఈసీ జ్ఞానేశ్ కుమార్‌పై సుప్రీంకోర్టులో పిటిషన్

**ఢిల్లీ:** కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీఐ) చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియపై 'ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్' పత్రికలో వెలువడిన పరిశోధనాత్మక కథనం దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపింది. ఈ నేపథ్యంలో, ప్రధాన ఎన్నికల కమిషనర్ (సీఈసీ) జ్ఞానేశ్ కుమార్‌కు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. మిగిలిన ఇద్దరు ఎన్నికల కమిషనర్ల ఆమోదం లేకుండా ఏకపక్షంగా తీసుకున్న ఎస్ఐఆర్ సంబంధిత నిర్ణయాలన్నింటినీ చట్టవిరుద్ధమైనవిగా ప్రకటించాలని పిటిషనర్ సర్వోన్నత న్యాయస్థానాన్ని కోరారు. ముఖ్యంగా నిబంధనలకు విరుద్ధంగా పోర్టల్‌లో మార్పులు చేసిన ఫారమ్-6ను రద్దు చేసి, ఓటర్ల నమోదు నియమాలు-1960 ప్రకారం నిర్దేశించిన అసలైన చట్టబద్ధమైన పాత 'ఫారమ్ 6'ను తక్షణమే పునరుద్ధరించాలని పిటిషన్‌లో విజ్ఞప్తి చేశారు. అలాగే దేశవ్యాప్తంగా దాదాపు 13 కోట్ల మంది ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించడంపై ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) లేదా న్యాయ విచారణ కమిషన్‌తో సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. దీంతో పాటు ప్రజాప్రాతినిధ్య చట్టం నిబంధనల ప్రకారం తమ అధికారిక విధులను ఉల్లంఘించినందుకు గాను సీఈసీ జ్ఞానేశ్ కుమార్, డిప్యూటీ ఎన్నికల కమిషనర్ మనీశ్ గార్గ్ (ఐఏఎస్), ఈసీఐ ఐటీ విభాగాధిపతి సీమా ఖన్నాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటూ క్రిమినల్ ప్రాసిక్యూషన్ చేపట్టాలని పిటిషనర్ సుప్రీంకోర్టును అభ్యర్థించారు. క్షేత్రస్థాయి ఎన్నికల అధికారుల అధికారాలను కేంద్రీకృతం చేస్తూ సాఫ్ట్‌వేర్ ద్వారా ఓట్ల చేర్పులు, తొలగింపులను ప్రభావితం చేశారని ఆరోపించారు. విచారణ నిమిత్తం ఈసీఐ నెట్‌వర్క్, ఈరోనెట్ సర్వర్ లాగ్‌లు, డేటాబేస్ వివరాలను సురక్షితంగా భద్రపరిచేలా ఆదేశాలు ఇవ్వాలని పేర్కొన్నారు. ఎన్నికల కమిషనర్ల అంతర్గత అసమ్మతి నోట్లు బహిర్గతమైన వేళ దాఖలైన ఈ పిటిషన్‌తో ఎన్నికల సంఘం వ్యవహారంపై న్యాయపరంగా, రాజకీయంగా తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

## భూముల రీ-సర్వేపై రైతులకు అవగాహన కార్యక్రమం




**మిర్యాలగూడ, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** భూముల రీ-సర్వే ప్రక్రియపై రైతులు, ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ సూచించారు. మిర్యాలగూడ మండలం గోగువారిగూడెం గ్రామంలో భూముల రీ-సర్వేపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శంకర్ నాయక్ మాట్లాడుతూ.. రీ-సర్వే ద్వారా భూ రికార్డులను పకడ్బందీగా రూపొందించడంతో పాటు భూ యజమానులకు స్పష్టమైన హక్కులు కల్పించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందన్నారు. రీ-సర్వే ప్రక్రియపై రైతులు, ప్రజలకు ఉన్న సందేహాలను అధికారులు ఎప్పటికప్పుడు నివృత్తి చేయాలని సూచించారు. భూ రికార్డులకు సంబంధించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని కోరారు. రీ-సర్వే ప్రక్రియ సజావుగా సాగేందుకు రైతులు, గ్రామస్తులు అధికారులకు సహకరించాలని ఎమ్మెల్సీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో ఎస్. రమణారెడ్డి, తహశీల్దార్ శ్రీనివాసులు, రెవెన్యూ అధికారులు, సిబ్బంది, ప్రజాప్రతినిధులు, రైతులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ధూళికట్ట నూతన సబ్‌స్టేషన్‌కు రూ. నాలుగు కోట్ల 44 లక్షల 30 వేల రూపాయలు నిధులు




**పెద్దపల్లి ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ఎలిగేడు మండలం ధూళికట్ట గ్రామంలో నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.నాలుగు కోట్ల 44 లక్షల 30 వేల రూపాయలు నిధులు మంజూరు కావడంతో గ్రామ రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ మాట్లాడుతూ నూతన సబ్‌స్టేషన్ మంజూరుకు కృషి చేసిన ప్రభుత్వ విప్, చింతకుంట విజయ రమణారావు కు రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకుల తరఫున ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. గ్రామంలో విద్యుత్ సరఫరా సమస్యలను పరిష్కరించడంతో పాటు రైతులకు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ అందించేందుకు నూతన సబ్‌స్టేషన్ ఎంతో ఉపయోగపడుతుందని సర్పంచ్ పేర్కొన్నారు. సబ్‌స్టేషన్ నిర్మాణంతో ధూళికట్టతో పాటు పరిసర ప్రాంతాల రైతులకు కూడా విద్యుత్ సరఫరా మరింత మెరుగుపడే అవకాశం ఉందన్నారు. ఎన్నో రోజులుగా రైతులు ఎదురుచూస్తున్న సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ నాలుగు కోట్ల 44 లక్షల 30 వేల రూపాయలు నిధులు మంజూరు కావడం పట్ల గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రైతులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పరస్పరం స్వీట్లు పంచుకుని తమ సంతోషాన్ని వ్యక్తం చేశారు. నిధులు మంజూరు చేయడంలో చొరవ చూపిన ఎమ్మెల్యేకు మరోసారి కృతజ్ఞతలు తెలుపుతూ, సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను త్వరితగతిన ప్రారంభించి రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మారం కొమురయ్య యాదవ్, ఉప సర్పంచ్ వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్ బాలుసాని పరుశరాములు గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మేచినేని వంశీకృష్ణ రావు, మేచినేని శ్రీనివాస్ రావు, ఎలిగేడు మార్కెట్ కమిటీ డైరెక్టర్ మేచినేని ఆంజనేయరావు, రైతులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## రెస్టారెంట్ వ్యాపారం పేరుతో రూ.43 లక్షల మోసం



**శేరిలింగంపల్లి,ఫ్లాష్ ఇండియా :** రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళను మోసం చేసి, బెదిరింపులకు పాల్పడుతూ లైంగికంగా వేధించిన కేసులో షేక్ నబీ అనే వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఇన్స్పెక్టర్ భూపతి కథనం ప్రకారం.. రాయదుర్గం పరిధిలోని ఓ ప్రైవేటు కంపెనీ అడ్మినిస్ట్రేటివ్ విభాగంలో పనిచేస్తున్న మహిళకు, అదే కంపెనీ ఉద్యోగులకు ఫుడ్ వెండర్‌గా పనిచేసే షేక్ నబీతో పరిచయం ఏర్పడింది. నిందితుడు కంపెనీ సమీపంలో బాక్స్ క్రికెట్ నిర్వహించేవాడు. ఈ క్రమంలో కంపెనీ ఉద్యోగులు బాక్స్ క్రికెట్ బుక్ చేసుకునే సమయంలో బాధితురాలికి నిందితుడితో పరిచయం ఏర్పడింది. 2023లో కంపెనీ ఉద్యోగులు బాక్స్ క్రికెట్ అనంతరం నిర్వహించిన పార్టీ సందర్భంగా తనకు తెలియకుండా కూల్‌డ్రింక్‌లో మత్తు పదార్థం కలిపి, తనపై లైంగిక దాడికి పాల్పడటంతో పాటు వీడియోలు, ఫొటోలు తీసినట్లు బాధితురాలు ఫిర్యాదులో ఆరోపించింది. ఆ తర్వాత నిందితుడు తనతో కలిసి రెస్టారెంట్ వ్యాపారం ప్రారంభిస్తే మంచి లాభాలు వస్తాయని నమ్మించి, వ్యాపారంలో పెట్టుబడి పేరుతో సుమారు రూ. 43 లక్షలు తీసుకున్నట్లు ఫిర్యాదులో పేర్కొంది. తన వద్ద ఉన్న వ్యక్తిగత వీడియోలు, ఫొటోలను చూపిస్తూ తన లైంగిక కోరికలకు సహకరించకపోతే వాటిని బాధితురాలి భర్త, పిల్లలు, బంధువులకు పంపిస్తానని నిందితుడు బెదిరించినట్లు పోలీసులు తెలిపారు. దీంతో భయపడిన బాధితురాలు నిందితుడి వేధింపులను భరించాల్సి వచ్చిందని ఫిర్యాదులో పేర్కొంది. వేధింపులు భరించలేక చివరకు జరిగిన విషయాన్ని భర్తకు చెప్పిన బాధితురాలు, ఆయన సూచనతో రాయదుర్గం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. దర్యాప్తులో భాగంగా నిందితుడు షేక్ నబీని అతని కార్యాలయంలో అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేశారు.



## ఎస్జీటీ ఉపాధ్యాయులపై పెరుగుతున్న పనిభారం

**పెద్దపల్లి, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** ఎలిగేడు మండలంలోని ఎస్జీటీ ఉపాధ్యాయులు బోధనా కార్యక్రమాలతో పాటు వివిధ అదనపు విధులు, రికార్డుల నిర్వహణ, నివేదికలు, ఆన్‌లైన్ పనులు, ఇతర శాఖాపరమైన బాధ్యతలతో తీవ్ర పనిభారాన్ని ఎదుర్కొంటున్నారని తెలిపారు. అదనపు పనుల కారణంగా మానసిక ఒత్తిడి పెరుగుతోందని పేర్కొన్నారు. బోధనా కార్యక్రమాలకు కేటాయించాల్సిన సమయం అదనపు పనుల నిర్వహణలో తగ్గిపోవడంతో విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించడంపై ప్రభావం పడుతోందని ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులపై అనవసరమైన అదనపు పనిభారం తగ్గించి, బోధనకు తగినంత సమయం కేటాయించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ మేరకు ఎంఈఓ, కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్ ఎలిగేడు వారికి ఉపాధ్యాయులు వినతి పత్రం సమర్పించి, సమస్యను సానుకూలంగా పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

# తాండూరులో ప్రైవేట్ విద్యా 'మాఫియా' దౌర్జన్యం

> 12 గంటలపాటు కుర్చీలకే బందీలుగా విద్యార్థులు!
> ప్రభుత్వ ఆదేశాలు తుంగలో..
> సొంత రాజ్యాంగం అమలు!
> ఉదయం 8 నుంచి రాత్రి 8 వరకు నరకయాతన -రోబోలుగా మారుతున్న చిన్నారులు
> మామూళ్ల మత్తులో విద్యాశాఖ అధికారులు -పట్టించుకోని జిల్లా యంత్రాంగం!

**తాండూరు, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** తాండూరు పట్టణంలో ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల అరాచకాలు హద్దులు దాటాయి. ప్రభుత్వ నిబంధనలను, విద్యాశాఖ ఆదేశాలను బూట్ల కింద తొక్కేస్తూ తమ సొంత 'కూర్మాసన' రాజ్యాంగాన్ని చలామణి చేస్తున్నాయి. చదువు పేరిట ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ఏకంగా 12 గంటల పాటు పసిమొగ్గలను తరగతి గదుల్లో బంధించి పిప్పి చేస్తున్నా అడిగే నాథుడే కరువయ్యాడు. ఉదయం కన్ను విప్పింది మొదలు రాత్రి పూట ఇళ్లకు చేరేవరకు విద్యార్థులను మనుషులుగా కాకుండా కేవలం మార్కులు తెచ్చే రోబోలా మారుస్తున్నారు. ఆటపాటలు, సృజనాత్మకత అనే పదాలకే తావులేకుండా చేసి, విపరీతమైన పుస్తకాల మోతతో విద్యార్థులను తీవ్ర మానసిక ఆందోళనలోకి నెట్టేస్తున్నారు. రాత్రి ఇళ్లకు వచ్చేసరికి పిల్లలు ప్రాణమున్న శవాల్లా మారుతుంటే, కనీసం తల్లిదండ్రులతో కాసేపు ప్రశాంతంగా మాట్లాడే సమయం కూడా దక్కడం లేదు. వ్యాపార ధోరణితో ప్రైవేట్ యాజమాన్యాలు ఆడుతున్న ఈ ర్యాంకుల వేటలో పిల్లల భవిష్యత్తు అంధకారంలోకి పోతోందని మేధావులు మండిపడుతున్నారు. తాండూరులో ప్రైవేట్ విద్యాసంస్థలు బహిరంగంగానే రూల్స్ బ్రేక్ చేస్తున్నా సంబంధిత విద్యాశాఖ అధికారులు కనీసం కన్నుతెరిచి చూడకపోవడం వెనుక పెద్ద ఎత్తున మామూళ్ల పంపిణీ జరిగిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల నిర్లక్ష్యం, ప్రైవేట్ యాజమాన్యాలకు కొమ్ముకాసే ధోరణి చూస్తుంటే తాండూరులో అసలు ప్రభుత్వ విద్యాశాఖ ఉందా? లేక ప్రైవేట్ వ్యాపారుల చేతుల్లో బందీ అయిందా? అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇప్పటికైనా జిల్లా స్థాయి ఉన్నతాధికారులు నిద్రమత్తు వదిలి తక్షణమే తాండూరులోని ప్రైవేట్ విద్యాసంస్థలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. సమయాతిక్రమణకు పాల్పడుతూ నిబంధనలు ధిక్కరిస్తున్న పాఠశాలలు, కళాశాలల గుర్తింపును తక్షణమే రద్దు చేసి, లైసెన్సులు రద్దు చెయ్యాలని డిమాండ్ చేస్తున్నారు.

**ఎప్పుడూ చదువులే**

వికారాబాద్ జిల్లాలలో కార్పొరేట్ పాఠశాలలు మరియు కళాశాలల్లో ఎప్పుడు చదువులే. అనే విద్యార్థి యొక్క మానసిక ఒత్తిడికి గురిచేస్తున్నారు. రోజుకు 12 గంటలు చదువు చదవడంతో విద్యార్థులు తీవ్ర అలసటకు ఆందోళనకు గురవుతున్నారు. కనీసం తల్లిదండ్రులు కూడా విద్యార్థులకు ఎంత చదువు ఉండదు. అని ఆలోచన చేయడం లేరు. ఎంత చదివితే అంత బాగా నేర్చుకుంటారని దశలోనే తల్లిదండ్రులు ఉన్నారు. విద్యార్థుల మానసిక ఒత్తిడిని ఆందోళనను తల్లిదండ్రులు కానీ ఉపాధ్యాయులు కానీ పట్టించుకోవడం లేదు. దీనిపై విద్యాశాఖ అధికారులు మాత్రం నోరు మెదపడం లేరు.

## ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం



**వికారాబాద్ జిల్లా/ చౌడాపూర్ మండల, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి :** కుల్కచర్ల మండల కేంద్రంలోని రైతు వేదికలో నిర్వహించిన కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమానికి పరిగి ఎమ్మెల్యే,టీపీసీసీ ట్రైనింగ్ కమిటీ చైర్మన్ (SIR) డాక్టర్ టి.రామ్మోహన్ రెడ్డి గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కుల్కచర్ల మరియు చౌడపూర్ మండలంలోని పలు గ్రామాలకు చెందిన అర్హులైన 68మంది లబ్ధిదారులకు ఒక్కొక్కరికి రూ. 1,00,116 చొప్పున మొత్తం రూ. 68,07,888 (68 లక్షల 7 వేల 888 రూపాయలు) విలువగల కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులను ప్రజాప్రతినిధులు,అధికారులతో కలిసి ఎమ్మెల్యే గారు కళ్యాణ లక్ష్మి,షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు మాట్లాడుతూ...ప్రజా సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తోందని తెలిపారు. పేద, బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తూ ప్రజల జీవితాల్లో వెలుగులు నింపుతున్నామని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న వివిధ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని

ఎమ్మెల్యే డాక్టర్ టి. రామ్మోహన్ రెడ్డి గారు అధికారులకు, పార్టీ నాయకులకు సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా సమన్వయంతో పనిచేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు లబ్ధిదారులు పాల్గొన్నారు.



## వినాయక నిమర్జన వేడుకల్లో పాల్గొన్న PACS వైస్ చైర్మన్ ఎల్పటి అశోక్ కుమార్

**వికారాబాద్ జిల్లా/ చౌడాపూర్ మండల, ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** చౌడాపూర్ మండల కేంద్రంలో స్వామి వివేకానంద యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన శ్రీ వినాయకుడి నిమర్జన వేడుకలు భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ నిమర్జన కార్యక్రమంలో ఉమ్మడి కులకచర్ల--చౌడాపూర్ మండలాల ప్యాక్స్ వైస్ చైర్మన్ ఎల్పటి అశోక్ కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయకుని ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. వినాయక నిమర్జన కార్యక్రమంలో యువజన సంఘం సభ్యులు, భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తుల జై-జైకారాలతో చౌడాపూర్ మండల కేంద్రంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

# ప్రజల సహకారం భేష్..



**హైదరాబాద్,ఫ్లాష్ ఇండియా :** హైదరాబాద్ లో గణేష్ శోభయాత్ర ప్రశాంతంగా కొనసాగింది. భక్తులు, నగర ప్రజలు, నిర్వాహకులు అందించిన సహకారానికి సీపీ సజ్జనార్ ధన్యవాదాలు తెలిపారు. హైదరాబాద్ పోలీసు కమిషనరేట్ పరిధిలో మొత్తం 14854 విగ్రహాలు నిమజ్జనానికి తరలివచ్చాయన్నారు. 3వ రోజు నుంచి వినాయక విగ్రహాల నిమజ్జనాలు ప్రారంభమైయ్యాయన్నారు. దాదాపు 20 వేల మంది పోలీసు సిబ్బందితో పాటు, 10 వేల సీసీ కెమెరాలు , 12 డ్రోన్ కెమెరాలు, హై-రైజ్ కెమెరాలు, మౌంటెడ్ వెహికిల్ కెమెరాలతో భద్రతను కట్టుదిట్టం చేశామని సీపీ తెలిపారు. ఖైరతాబాద్ బడా గణేష్ తరలింపులో కొంత ఆలస్యం జరిగినప్పటికి అనుకున్న టైంకు నిమజ్జనం జరిగిందన్నారు. భక్తులు భారీగా తరలి వచ్చారని, పోలీసులకు సహకరించి నిమజ్జనాలు ప్రశాంతంగా జరిగేలా తోడ్పడ్డారని సీపీ పేర్కొన్నారు. గత మూడు నెలలుగా అన్ని ప్రభుత్వ శాఖ ఉన్నతాధికారులతో కలిసి సమన్వయంతో ఒక ప్రణాళిక ప్రకారం పని చేయడంతో నవరాత్రులు ప్రారంభం నుంచి నిమజ్జనాల చివరి ఘట్టం వరకు ఇబ్బందులు లేకుండా కొనసాగిందన్నారు. ప్రతి పోలీసు ఆఫీసర్ ఈ కార్యక్రమంలో సమర్థవంతంగా పని చేశారన్నారు. ఎక్కడ కూడా చిన్న అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోలేదన్నారు.

**టీజీఐసీసీసీ లోని కమాండ్ కంట్రోల్ చాలా కీలకం**

కమాండ్ కంట్రోల్ కేంద్రం అధికారులు, డైరెక్టర్ కమలహాసన్ రెడ్డి టీం ఈ పండుగ సందర్భంగా ప్రతి రోజు 24/7 పని చేశారని సీపీ సజ్జనార్ అభినందించారు. హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి, ఫ్యూచర్ సిటీ తో పాటు మిగతా 6 కమిషనరేట్ లు, జిల్లాలోని ప్రధాన కేంద్రాలలో ఉన్న సీసీ కెమెరాలను కమాండ్ కంట్రోల్ కు అనుసంధానం చేయడంతో వాటి ద్వారా పరిస్థితులను ఎప్పటికప్పుడు వీక్షిస్తూ కమాండ్ కంట్రోల్ సిబ్బంది, ఇతర ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు ఫీల్డ్ లో ఉన్న అధికారులను అప్రమత్తం చేస్తూ నిమజ్జనాలు సజావుగా సాగేలా చర్యలను తీసుకున్నారు. కమాండ్ కంట్రోల్ ద్వారా అందిన సహకారంతో శోభ యాత్రలో ఏలాంటి గందరగోళ పరిస్థితులు లేకుండా చేశామన్నారు. అదే విధంగా డయల్ 112 కు వచ్చిన కాల్స్ ద్వారా అందిన సమాచారంతో వెంటనే స్థానికంగా ఉన్న పోలీసులు, ఇతర శాఖల అధికారులను అలర్ట్ చేసి సమస్యలు తలెత్తకుండా కమాండ్ కంట్రోల్ సిబ్బంది అద్భుతంగా పనిచేశారని సీపీ వివరించారు. హైదరాబాద్ (14854) , సైబరాబాద్(11963), మల్కాజిగిరి(12167), ఫ్యూచర్ సిటీ(5258) పోలీసు కమిషనరేట్ పరిధిలో మొత్తం 44242 గణేష్ విగ్రహాలను ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఈ విగ్రహాలన్ని నిమజ్జనం అయ్యే వరకు కమాండ్ కంట్రోల్ సిబ్బంది పరిశీలిస్తున్నారని సీపీ చెప్పారు. శనివారం ఉదయం కల్లా అన్ని విగ్రహాలు నిమజ్జనం పూర్తి చేసుకుంటాయని ఆశిస్తున్నామని సీపీ సజ్జనార్ వెల్లడించారు.

## లారీ ఢీకొని వ్యక్తి మృతి



**మిర్యాలగూడ,ఫ్లాష్ ఇండియా ప్రతినిధి:** పెద్దతండ, కేజేఆర్ కాలనీ,దిలావర్ పూర్ కు చెందిన ధనావత్ మంగ్తా తండ్రి సేవియా( 61 సం)లు వృత్తి వ్యవసాయం అను అతను శుక్రవారం నాడు మిర్యాలగూడ లోని బ్యాంక్ ఆఫ్ బరోడా బ్యాంక్ లో పని ఉండి తన టీవీఎస్ ఎక్సెల్ టీఎస్ 05 ఎఫ్బి1429 గల దానిమీద మిర్యాలగూడకు రావడం జరిగింది. అందాజా ఉదయం 10:30 గంటల సమయంలో టీ తాగడం కోసం హనుమాన్ పేట ఫ్లైఓవర్ వద్దకు రాగా అదే సమయంలో లారీ ఏపీ 24 వి 9036 నెంబర్ గల లారీ సాగర్ రోడ్డు నుండి హైదరాబాద్ పోవుటకు లారీ తీసుకురావడం జరిగింది. డ్రైవర్ షేక్ ఖాజా నివాసం మిర్యాలగూడ తన లారీని నిర్లక్ష్యంగా నడిపి లెఫ్ట్ సైడ్ టర్న్ తీసుకోగా లారీ ముందు టైర్లు మృతుడి తలం మీదుగా వెళ్ళగా తల పగిలి అక్కడికక్కడే మరణించాడు. మృతుని కొడుకు దానవత్ కృష్ణ పిర్యాదు మేరకు టూ టౌన్ ఎస్సై ఆంజనేయులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.




# ఆసియా క్రీడల్లో భారత్‌కు రెండో స్వర్ణం

ఆసియా క్రీడల్లో భారత షూటర్లు తమ సత్తా చాటుతూ దేశానికి రెండో ప్రతిష్ఠాత్మక స్వర్ణ పతకాన్ని అందించారు. శుక్రవారం జరిగిన 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ ఫైనల్ ఈవెంట్‌లో భారత షూటింగ్ ద్వయం కమల్‌జీత్, సురుచి సింగ్ అద్భుత ప్రదర్శనతో విజయం సాధించి పసిడి పతకాన్ని ముద్దాడారు. వ్యక్తిగత ఈవెంట్లలో ఎదురైన నిరాశను అధిగమించి సమష్టిగా బరిలోకి దిగిన ఈ యువ జోడీ, ఆద్యంతం గురి తప్పకుండా పాయింట్ల వర్షం కురిపించింది. ఈ విజయంతో ప్రస్తుత ఆసియా క్రీడల్లో భారత బృందానికి ఇది రెండవ బంగారు పతకం కాగా, షూటింగ్ విభాగం నుంచి భారత్ తన ఆధిపత్యాన్ని మరోసారి నిరూపించుకుంది. అంతకుముందు జరిగిన క్వాలిఫికేషన్ రౌండ్‌లోనూ కమల్‌జీత్–సురుచి జోడీ 29 ఇన్నర్ 10 లతో కలిపి మొత్తం 587 పాయింట్లు స్కోర్ చేసి పట్టికలో అగ్రస్థానంలో నిలిచి ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఫైనల్ పోరులో ఇరాన్, దక్షిణ కొరియా, ఇండోనేషియా జట్ల నుంచి గట్టి పోటీ ఎదురైనప్పటికీ, ఏమాత్రం ఒత్తిడికి లోనుకాకుండా చివరి వరకు తమ లీడ్‌ను కాపాడుకుంటూ స్వర్ణ పతకాన్ని కైవసం చేసుకున్నారు. ట్రాక్ అండ్ ఫీల్డ్ తర్వాత షూటింగ్‌లోనూ భారత క్రీడాకారులు అద్భుత విజయాలు సాధిస్తూ పతకాల సంఖ్యను పెంచుతుండటంపై క్రీడా వర్గాలు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ ఈ జోడీ పై ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు.

## భారత్‌కు రజత పతకం

ప్రతిష్ఠాత్మక ఆసియా క్రీడల్లో భారత అథ్లెట్లు తమ అద్భుత ప్రదర్శనతో మరోసారి త్రివర్ణ పతాకాన్ని రెపరెపలాడించారు. ట్రాక్ అండ్ ఫీల్డ్ ఈవెంట్లలో భాగంగా అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన మిక్స్‌డ్ 4X400 మీటర్ల రిలే విభాగంలో భారత జట్టు రజత పతకాన్ని కైవసం చేసుకుంది. భారత క్వార్టెట్ పూవమ్మ రాజు, విశాల్ తెన్నరసు, విద్యా రామ్‌రాజ్, మను టి.ఎస్. సమష్టి కృషితో పరుగును పూర్తి చేసి దేశానికి గర్వకారణమైన విజయాన్ని అందించారు. ఆద్యంతం హోరాహోరీగా సాగిన ఫైనల్ రేసులో భారత రన్నర్లు చివరి క్షణం వరకు ప్రత్యర్థులకు గట్టి పోటీనిచ్చి రెండో స్థానాన్ని దక్కించుకున్నారు. తీవ్ర పోటీ నెలకొన్న ఈ ఫైనల్ పోరులో భారత అథ్లెట్ల బృందం రేసును 3 నిమిషాల 14.46 సెకన్లలో (3:14.46) ముగించి అద్భుతమైన టైమింగ్‌ను నమోదు చేసింది. సీనియర్ రన్నర్ పూవమ్మ రాజు సమర్థవంతమైన నాయకత్వంతో పాటు యువ అథ్లెట్లు విశాల్, విద్యా, మను సమన్వయంతో వేగాన్ని ప్రదర్శించి పతకాన్ని ఖాయం చేశారు. భారత స్ప్రింటర్ల మెరుపు వేగం, అంకితభావం పట్ల క్రీడా ప్రముఖులు, అభిమానులు ప్రశంసల జల్లు కురిపిస్తున్నారు. ఆసియా క్రీడల్లో ట్రాక్ ఈవెంట్లలో భారత్‌కు నిరంతరం పతకాలు అందిస్తున్న ఈ విభాగంలో తాజా రజతం సాధించడంతో దేశవ్యాప్తంగా క్రీడా వర్గాలు హర్షం వ్యక్తం చేస్తున్నాయి.







# చివరి ఓవర్ థ్రిల్లర్..




భారత్, జపాన్ జట్ల మధ్య జరిగిన ఏకైక టీ20 మ్యాచ్‌లో టీమిండియా రెండు పరుగుల తేడాతో విజయం సాధించింది. వర్షం కారణంగా మ్యాచ్‌ను 5 ఓవర్లకు కుదించగా.. తొలుత బ్యాటింగ్ చేసిన శ్రేయాస్ సేన 5 ఓవర్లలో 4 వికెట్లకు 32 పరుగులు మాత్రమే చేసింది. ఆపై జపాన్ 5 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 30 పరుగులకే పరిమితమైంది. అయితే ఈ మ్యాచ్‌లో చివరి ఓవర్‌లో చోటుచేసుకున్న ఓ వివాదాస్పద వైడ్ నిర్ణయం సోషల్ మీడియాలో చర్చకు దారితీసింది. తొలుత వైడ్‌గా ప్రకటించిన బంతిని ఆ తర్వాత అంపైర్ వెనక్కి తీసుకోవడంతో.. భారత్ గెలుపు కోసం 'చీటింగ్'కు పాల్పడిందంటూ నెటిజన్స్ విమర్శలు చేశారు. జపాన్ ఇన్నింగ్స్ చివరి ఓవర్‌లో టీమిండియా బౌలర్ అక్షర్ పటేల్ వేసిన బంతి లెగ్‌స్టంప్ వైపు వెళ్లింది. ఆ సమయంలో బ్యాటింగ్ చేస్తున్న లెఫ్ట్ హ్యాండ్ బ్యాటర్ అలెగ్జాండర్ షిరాయ్–పాట్మోర్ ఆ బంతిని రివర్స్ స్వీప్ ఆడేందుకు ప్రయత్నించాడు. తొలుత అంపైర్ వైడ్‌గా ప్రకటించినప్పటికీ.. అనంతరం ఆ నిర్ణయాన్ని మార్చుకున్నాడు. బంతి వైడ్ కాదని అంపైర్ ప్రకటించాడు. ప్రస్తుత ఐసీసీ నిబంధనల ప్రకారం.. బ్యాటర్ రివర్స్ స్వీప్ లేదా స్విచ్ హిట్ తరహాలో తన స్టాన్స్‌ను మార్చుకుని షాట్ ఆడేందుకు ప్రయత్నిస్తే, ఆ మార్పును పరిగణనలోకి తీసుకుని వైడ్ నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఈ నిబంధన కారణంగానే అంపైర్ తన నిర్ణయాన్ని మార్చుకున్నట్లు మాజీ భారత క్రికెటర్, ప్రముఖ కామెంటేటర్ ఆకాశ్ చోప్రా వివరించాడు. అంపైర్ నిర్ణయం మ్యాచ్ ఫలితంపై కూడా ప్రభావం చూపింది. వైడ్‌గా ప్రకటించిన నిర్ణయం కొనసాగి ఉంటే.. జపాన్‌కు విజయం సాధించేందుకు అవకాశాలు మరింతగా ఉండేవి. అయితే అంపైర్ నిర్ణయం మారడంతో.. జపాన్ ఆరు పరుగులను మూడు బంతుల్లో చేయాల్సిన పరిస్థితి వచ్చింది. చివరికి భారత్ రెండు పరుగుల తేడాతో ఊహించని విజయం సాధించింది. తన యూట్యూబ్ ఛానెల్‌లో ఈ వివాదంపై స్పందించిన ఆకాశ్ చోప్రా.. భారత్ చీటింగ్ చేసిందంటూ వస్తున్న విమర్శలను ఖండించాడు. 'వైడ్ నిర్ణయం వెనక్కి తీసుకోవడంతో జపాన్‌ను భారత్ చీటింగ్ చేసి గెలిచిందని కొందరు అంటున్నారు. భారత జట్టు అంపైర్‌పై ఒత్తిడి తెచ్చిందని, అందుకే నిర్ణయం మార్చారని చెబుతున్నారు. కానీ అసలు విషయం నిబంధనల్లో ఉంది' అని చోప్రా పేర్కొన్నాడు. 'తొలుత నాకు కూడా ఈ నిబంధనపై పూర్తి అవగాహన లేదు. స్విచ్ హిట్ ఆడినప్పుడు మాత్రమే వైడ్ లైన్‌కు సంబంధించిన ప్రత్యేక నిబంధన వర్తిస్తుందని, రివర్స్ స్వీప్‌కు వర్తించదని నేను మొదట భావించా. అలాగే బంతి వేయడానికి ముందు బ్యాటర్ తన స్టాన్స్‌ను మార్చాడా లేదా అనే అంశం కూడా ముఖ్యమని అనుకున్నా. కానీ ఐసీసీ కొత్త నిబంధనలను పరిశీలించిన తర్వాత నా అవగాహన కూడా తప్పేనని స్పష్టమైంది. కొత్త ఐసీసీ నిబంధనల ప్రకారం స్విచ్ హిట్, రివర్స్ స్వీప్‌లను వేర్వేరుగా చూడరు. బ్యాటర్ తన స్థానాన్ని మార్చుకుని షాట్ ఆడేందుకు ప్రయత్నించినప్పుడు ఆ మార్పును నిబంధనల ప్రకారం పరిగణనలోకి తీసుకుంటారు' అని ఆకాశ్ చోప్రా తెలిపాడు. అంతేకాకుండా బౌలర్ బంతిని చేతిలో పట్టుకున్న సమయంలో బ్యాటర్ స్టాన్స్ మార్చాడా, బంతిని విడుదల చేసిన తర్వాత మార్చాడా అనే తేడా కూడా ఉండదని చోప్రా పేర్కొన్నాడు. బ్యాటర్ తన పొజిషన్ మార్చుకున్నట్లుగా పరిగణిస్తారని, అలాంటి సందర్భంలో నిబంధనల ప్రకారం బౌలర్‌కు ప్రయోజనం కలుగుతుందని వివరించాడు. 'ఐసీసీ కొత్త నిబంధనలను పరిశీలించాను. అంపైర్ల వివరణ కూడా విన్నాను. స్విచ్ హిట్, రివర్స్ స్వీప్ రెండింటినీ నిబంధనల్లో ఒకే విధంగా చూస్తున్నారు. బ్యాటర్ తన పొజిషన్‌ను ఎప్పుడు మార్చాడన్నది కూడా కీలకం కాదు. కుడిచేతి వాటం, ఎడమచేతి వాటం బ్యాటర్‌గా రెండు రకాలుగా పరిగణించబడవచ్చు. అందువల్ల బౌలర్‌కు ప్రయోజనం లభిస్తుంది' అని చోప్రా వివరించాడు. భారత్–జపాన్ మ్యాచ్‌లో వివాదాస్పదంగా మారిన వైడ్ నిర్ణయం వెనుక నిబంధనలు ఉన్నాయని చోప్రా స్పష్టం చేశాడు.

# బిజినెస్



# స్వల్పంగా పెరిగిన బంగారం ధరలు..

అంతర్జాతీయ ఆర్థిక, భౌగోళిక, రాజకీయ ఉద్రిక్తతలతో ఇటీవల బంగారం, వెండి ధరల్లో భారీగా హెచ్చుతగ్గులు నమోదయ్యాయి. నిన్న తగ్గిన బంగారం ధరలు ఈరోజు (శుక్రవారం) స్వల్పంగా పెరిగాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం.. ఇవాళ ఉదయం 10 గంటల సమయానికి దేశ రాజధాని ఢిల్లీలో నిన్నటి ధరలతో పోలిస్తే 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.160 పెరిగి రూ.1,52,990గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి రేటు రూ.150 పెరిగి రూ.1,40,250కి చేరుకుంది. ఇక విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్ నగరాల్లో నిన్నటి ధరలతో పోలిస్తే 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.160 పెరిగి రూ.1,52,840గా ఉండగా..
22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి రేటు రూ.150 పెరిగి రూ.1,40,100కి చేరుకుంది.
ఢిల్లీలో కిలో వెండి ధర రూ.2,45,000 ఉండగా.. తెలుగు రాష్ట్రాల్లో రూ.2,50,000 వద్ద కొనసాగుతోంది.

# చార్జీల భారం ప్రజలపై పడదు



యూపీఐ డిజిటల్ చెల్లింపులపై మర్చంట్ డిస్కౌంట్ రేట్ చార్జీల విధింపుపై దేశవ్యాప్తంగా సాగుతున్న ప్రచారానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ గా తెరదించారు. ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన ఆమె.. ఈ అంశంపై సాధారణ ప్రజలు, వినియోగదారులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన పనిలేదని, దీనివల్ల ఖాతాదారులపై పైసా భారం కూడా పడబోదని తేల్చిచెప్పారు. చాలామంది ఈ నిబంధనను సరిగ్గా అర్థం చేసుకోకుండా అపోహలకు గురవుతున్నారని ఆమె విచారం వ్యక్తం చేశారు. ₹2,000 కంటే ఎక్కువ మొత్తంలో జరిగే నిర్దిష్ట లావాదేవీలపై విధించే ఎండీఆర్ చార్జీలు కేవలం వ్యాపారులకు (మర్చంట్స్) మాత్రమే వర్తిస్తాయని, ఇప్పటికే వారు డెబిట్, క్రెడిట్ కార్డుల చెల్లింపుల విషయంలో ఈ రుసుములను భరిస్తున్నారని గుర్తుచేశారు. కార్డుల మాదిరిగానే ఈ భారాన్ని కూడా వ్యాపారులు కస్టమర్లపై మోపే అవకాశం లేదని ఆమె స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎండీఆర్ స్వరూపాన్ని వివరిస్తూ.. ఇది కేంద్ర ప్రభుత్వం విధించే పన్ను (ట్యాక్స్), సెస్, సర్ ఛార్జ్ ఎంత మాత్రం కాదని నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. ఈ ప్రక్రియ ద్వారా వసూలయ్యే మొత్తం నయాపైసా కూడా భారత ప్రభుత్వ ఖజానాకు చేరదని కుండబద్దలు కొట్టారు. డిజిటల్ నెట్‌వర్క్‌ను నిరంతరం నడిపించే బ్యాంకులు, పేమెంట్ సర్వీస్ గేట్‌వేల నిర్వహణ వ్యయం కోసం మాత్రమే ఇది ఉద్దేశించబడిందని, మార్కెట్లో ఇప్పటికే అమలులో ఉన్న ఇతర కార్డుల నియమ నిబంధనల ప్రకారమే దీనిని సమర్థిస్తున్నానని ఆమె స్పష్టం చేశారు. తప్పుడు ప్రచారాలను నమ్మి ప్రజలు అయోమయానికి గురి కావద్దని, దేశంలో డిజిటల్ చెల్లింపుల ప్రక్రియ ఎప్పటిలాగే సామాన్యులకు ఉచితంగా, నిరాటంకంగా కొనసాగుతుందని వివరించారు.

# విద్యార్థులకు ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ బంపర్ ఆఫర్



విద్యార్థుల కోసం ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్ ప్రత్యేక ఆఫర్ ప్రకటించింది. కాలేజీ సెమిస్టర్లు, ఇంటర్న్‌షిప్‌లు, ఇంటికి వెళ్లే విద్యార్థుల ప్రయాణ భారాన్ని తగ్గించేందుకు ప్రత్యేక డిస్కౌంట్ ఇస్తున్నట్టు వెల్లడించింది. అక్టోబర్ 20, 2026 వరకు అందుబాటులో ఉండే ఈ ఆఫర్‌లో 12 ఏళ్లు పైబడిన విద్యార్థులు తమ విమాన బేస్ ఛార్జీలపై ఫ్లాట్ 10 శాతం డిస్కౌంట్‌ను పొందవచ్చు. దీనికి తోడు సాధారణంగా ఇచ్చే 15 కేజీల పరిమితికి అదనంగా మరో 10 కేజీలు కలిపి, మొత్తం 25 కేజీల వరకు చెక్-ఇన్ బ్యాగేజీని ఉచితంగా తీసుకెళ్లే వెసులుబాటు కల్పించారు. ఎయిర్‌లైన్ వెబ్‌సైట్ లేదా యాప్ ద్వారా నేరుగా బుక్ చేసుకుంటే కేవలం రూ. 99తో ప్రయాణ తేదీని మార్చుకోవచ్చు. అలాగే, 'వైబ్స్ ' ప్రోమో కోడ్ ఉపయోగిస్తే అదనంగా మరో 5 శాతం తగ్గింపు, వీసా కార్డ్ చెల్లింపులపై అక్టోబర్ 9 వరకు రూ. 600 వరకు ప్రత్యేక డిస్కౌంట్ లభిస్తాయి. చెక్-ఇన్ సమయంలో ఫోటో, పుట్టిన తేదీ ఉన్న స్టూడెంట్ ఐడీ కార్డును చూపించి
ఈ ప్రయోజనాలను సులభంగా పొందవచ్చని కంపెనీ పేర్కొంది.



# ఎల్పీజీ సిలిండర్ల డెలివరీ ఆగిపోతుందా?

అక్టోబర్ 1 నుంచి గృహ వినియోగదారుల సబ్సిడీ గ్యాస్ సిలిండర్ల కొరకు బయోమెట్రిక్ ఆధార్ అథెంటికేషన్ తప్పనిసరి చేశారు. అయితే ఈ ప్రక్రియ పూర్తి చేయని వినియోగదారుల గ్యాస్ డెలివరీని నిలిపివేయరు. వారు ఆయిల్ మార్కెటింగ్ కంపెనీల డిజిటల్ ఛానెల్స్ ద్వారా దీనికి నమోదు చేసుకోవచ్చు. సబ్సిడీ లేకుండా మార్కెట్ ధరపై 5 లేదా 10 కేజీల సిలిండర్లు పొందవచ్చు. డెలివరీ సమయంలో సిబ్బంది ద్వారా లేదా డిస్ట్రిబ్యూటర్ దుకాణానికి వెళ్లి ఈ ప్రక్రియ పూర్తి చేయవచ్చు. వినియోగదారులు తమ మొబైల్ యాప్స్ ద్వారా కూడా ఈ–కేవైసీ పూర్తి చేసే సదుపు కల్పించారు. ఇండేన్ కోసం ఇండేన్ ఆయిల్ వన్, భారత్ గ్యాస్ కోసం హలో బీపీసీఎల్, హెచ్‌పీ గ్యాస్ కోసం హెచ్‌పీ పే యాప్ ఉపయోగించాలి. ఈ అథెంటికేషన్ ప్రధాన ఉద్దేశం సబ్సిడీ సిలిండర్లు అర్హులైన కుటుంబాలకే అందేలా చూడటం. దీనివల్ల డూప్లికేట్, అనర్హమైన కనెక్షన్‌లను తొలగించవచ్చు. అంతేకాకుండా సబ్సిడీ సిలిండర్లను కమర్షియల్, పారిశ్రామిక అవసరాలకు మళ్లించకుండా అడ్డుకోవడంతో పాటు సబ్సిడీ పంపిణీలో పారదర్శకత పెరుగుతుంది. ఈ బయోమెట్రిక్ ఆధార్ అథెంటికేషన్ పూర్తి చేయడానికి ప్రభుత్వం మొదట జూన్ 30 గడువు విధించింది. వినియోగదారుల సౌలభ్యం కోసం ఈ గడువును జూలై 31, ఆగస్టు 7, 15, 23, 31, సెప్టెంబర్ 7, సెప్టెంబర్ 14 వరకు పలుమార్లు పొడిగించారు. చమురు మార్కెటింగ్ కంపెనీలు దేశవ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, 12 కోట్లకు పైగా ఎస్ఎంఎస్, వాట్సాప్ సందేశాలను పంపాయి. గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసి డెలివరీ సిబ్బంది ద్వారా నేరుగా సంప్రదించారు. సెప్టెంబర్ 2026 నాటికి ప్రతి 14.2 కేజీల సిలిండర్‌పై సబ్సిడీ దాదాపు రూ. 210గా ఉంది. వినియోగదారులు సకాలంలో ఈ ఆధార్ అథెంటికేషన్ పూర్తి చేయడం ద్వారా ఎలాంటి అంతరాయం లేకుండా సిలిండర్లను పొందవచ్చని ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రభుత్వ ఈ నూతన నిబంధనల వల్ల గ్యాస్ పంపిణీ వ్యవస్థ మరింత పారదర్శకంగా మారుతుంది.

# 'లవ్ అండ్ వార్' డేట్ ఫిక్స్..

సంజయ్ లీలా భన్సాలీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న హై-ప్రొఫైల్ ఎంటర్‌టైనర్ 'లవ్ అండ్ వార్' . బాలీవుడ్ క్యూట్ కపుల్ రణబీర్ కపూర్, అలియా భట్ జంటగా, విక్కీ కౌశల్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ చిత్రం నుంచి తాజాగా అదిరిపోయే అప్డేట్ ఇచ్చారు మేకర్స్. లవ్ అండ్ వార్ చిత్రం వచ్చే ఏడాది జనవరి 21న ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతున్నట్లు తెలుపుతూ.. రణబీర్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడదుల చేశారు. ఇందులో రణబీర్ వింటేజ్ కార్ డ్రైవ్ చేస్తూ, వైట్ టీషర్ట్, గ్లాసెస్, షార్ట్ బజ్ కట్‌తో కనిపిస్తున్న RK లుక్ సింపుల్‌గా ఉన్నా.. రక్తంతో గాయపడిన చేతిని మాత్రం హైలెట్‌గా చూపిస్తూ క్యూరియాసిటీ పెంచేశారు టీమ్. కాగా.. ఈ సినిమాకు సంబంధించిన ప్రధాన షూటింగ్ ఇప్పటికే పూర్తయింది. అయితే వార్ సీక్వెన్స్‌ల కోసం రణ్‌బీర్, అలియా, విక్కీతో అదనపు షూట్ జరిగినట్లు కూడా తెలుస్తోంది. ఈ సినిమాకు సంబంధించిన మరో విశేషం ఏంటంటే.. లవ్ అండ్ వార్ ఇంకా థియేటర్‌లోకి రాకముందుకే ఈ సినిమా OTT హక్కులు నెట్‌ఫ్లిక్స్ భారీ ధరకు సొంతం చేసుకుంది.






# కాస్టింగ్ కాల్ ప్రకటించిన రిషబ్ శెట్టి

'కాంతార' ఫేమ్ డైరెక్టర్, హీరో రిషబ్ శెట్టి.. తాజాగా సామాన్యులకు గుడ్ న్యూస్ చెప్పాడు. తన అధికారిక సోషల్ మీడియా అకౌంట్ ఎక్స్ వేదికగా రిషబ్ శెట్టికి చెందిన రిషబ్ శెట్టి ఫిల్మ్స్ సంస్థ తమ కొత్త సినిమా కోసం కొత్త నటీనటుల నుండి దరఖాస్తులు కోరుతూ ఓపెన్ కాస్టింగ్ కాల్ ప్రకటించింది. ఈ మేరకు.. 'సినిమా రంగంలో మీ ప్రయాణం ఇక్కడే మొదలవ్వొచ్చు. ఒక కొత్త కథ రూపుదిద్దుకుంటోంది.. 'రిషబ్ శెట్టి ఫిల్మ్స్' వారి ఈ ఉత్సాహభరితమైన కొత్త ప్రాజెక్ట్‌లో భాగమయ్యేందుకు మేము కొత్త ప్రతిభావంతుల కోసం చూస్తున్నాము. మీలో ఆ సామర్థ్యం ఉందని మీరు భావిస్తే, సినిమా ప్రపంచంలోకి అడుగుపెట్టడానికి ఇది మీకు ఒక గొప్ప అవకాశం కావచ్చు.. రండి, ఈ ప్రయాణంలో భాగం అవ్వండి' అని తెలిపుతూ కీలక నోట్ షేర్ చేశాడు. విజయా కాలేజ్, బెంగళూరు వేదికగా అక్టోబర్ 2, 2026న ఈ ఆడిషన్ జరగనున్నట్లు తెలిపారు. అలాగే వయసు పరిమితి: పురుషులు: 20 నుంచి 65 సంవత్సరాలు, మహిళలు: 20 నుంచి 60 సంవత్సరాలు. ఆసక్తి గల అభ్యర్థులు తమ రెజ్యూమ్, ప్రొఫైల్స్ అండ్ వర్క్ వర్క్‌లింక్స్‌ను rrrfilmz@gmail.com ఈమెయిల్ ఐడీకి పంపవచ్చు. అలాగే అధికారిక సోషల్ మీడియా అప్‌డేట్స్ కోసం రిషబ్ శెట్టి ఇన్‌స్టాగ్రామ్ పేజీను చూడవచ్చునని తెలిపారు.

# టాలీవుడ్ అంతా కన్నడ భామల వెనుకే!

తెలుగులోకి ఎంట్రీ ఇచ్చిన కన్నడ భామ రష్మిక నేషనల్ క్రష్ గా ఎదిగింది. 'ఛలో' అంటూ తెలుగులో కెరీర్ స్టార్ట్ చేసిన రష్మిక, స్టార్ హీరోయిన్ గా ఎదిగింది. 'పుష్ప' తర్వాత జాతకం మారిపోయి పాన్ ఇండియా హీరోయిన్ గా సెటిల్ అయిపోయింది రష్మిక. మరో కన్నడ బ్యూటీ రుక్మిణి వసంత్ ఆరేళ్ల క్రితమే వెండి తెరపైకి వచ్చింది. 'సప్తసాగరాలు దాటి' సినిమాతో క్రేజ్ తెచ్చుకొని, 'కాంతార: చాప్టర్ వన్' తో పాన్ ఇండియా ఇమేజ్ సంపాదించింది. ప్రస్తుతం క్రేజీ మూవీ 'డ్రాగన్' లో నటిస్తోంది రుక్మిణి. 'ఉప్పెన' వంటి బ్లాక్ బస్టర్ తో తెలుగులోకి ఎంట్రీ ఇచ్చిన కన్నడ బ్యూటీ కృతి శెట్టి, హ్యాట్రిక్ సొంతం చేసుకుంది. ఆ తర్వాత నటించిన సినిమాలన్నీ ఫ్లాప్లే. గ్యాప్ తర్వాత జనవరి 12న విడుదలైన మూవీలో అనిల్ రావిపూడి ఛాన్స్ ఇచ్చాడు. కళ్యాణ్ రామ్ కు జోడీగా నటిస్తూ అదృష్టం పరీక్షించుకుంటోంది. తెలుగు ఇండస్ట్రీని ఏలిన అనుష్క కన్నడ బ్యూటీనే! అందాల తార ఐశ్వర్య రాయ్, దీపికా పదుకొనేలది కేర్ ఆఫ్ కర్ణాటకే. పూజా హెగ్డే ప్రస్తుతం హిట్స్ లేక అవస్థలు పడుతోందే గానీ, గతంలో తెలుగులో స్టార్స్ అందరిని చుట్టేసింది.



# 'ఫౌజీ' టీజర్ వస్తోంది




పాన్ ఇండియా రెబల్ స్టార్ ప్రభాస్, దర్శకుడు హను రాఘవపూడి కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న మోస్ట్ అవైటెడ్ పీరియాడిక్ డ్రామా 'ఫౌజీ'. టాలీవుడ్ బడా నిర్మాణ సంస్థ మైత్రి మూవీస్ భారీ బడ్జెట్ పై ఈ సినిమాను నిర్మిస్తోంది. ఈ చిత్రానికి సంబంధించిన ఓ న్యూస్ ఇప్పుడు నెట్టింట తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. టాలీవుడ్ లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, అక్టోబర్ 23న ప్రభాస్ పుట్టినరోజు సందర్భంగా 'వర్ల్డ్ ఆఫ్ ఫౌజీ' అనే ప్రత్యేకమైన టీజర్ వీడియోను ఆ రోజే విడుదల చేసేందుకు చిత్రబృందం చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఈ వీడియో ద్వారా ఫౌజీ వరల్డ్, ప్రభాస్ క్యారెక్టర్ లుక్‌ను ఆవిష్కరించబోతున్నారని సమాచారం.మ-రోవైపు ఈ సినిమా చిత్రీకరణ కూడా వేగంగా సాగుతోంది. ప్రస్తుతం జరుగుతున్న భారీ యాక్షన్ షెడ్యూల్ అక్టోబర్ 20 వరకు కొనసాగనుంది. ఆ తర్వాత సుమారు 10 రోజుల పాటు టాకీ పార్ట్ షూట్ చేయ-బోతున్నారట. ప్రభాస్ పై ఒక ప్రత్యేకమైన మాస్ మోంటాజ్ సాంగ్‌ను కూడా షూట్ చేసేందుకు షెడ్యూల్ ప్లాన్ చేసారు. మేకింగ్ విషయంలో ఎక్కడా కాంప్రమైజ్ కాకూడదని భావిస్తున్న మేకర్స్, కొత్త ఫైట్ మాస్టర్ల నేతృత్వంలో ఒక ప్రధాన ఫైట్ సీక్వెన్స్‌ను రీషూట్ చేస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. అన్ని అనుకున్నట్లు జరిగితే, నవంబర్ చివరినాటికి మొత్తం షూటింగ్‌ను పూర్తి చేసేలా పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్తున్నారు. ఈ ఏడాది డిసెంబర్ 3న రిలీజ్ చేయాలనీ భావించిన మేకర్స్ వాయిదా వే-స్తున్నట్టు ఇటీవల ప్రకటించారు. వచ్చే ఏడాది సమ్మర్ లో రిలీజ్ ప్లాన్ చేస్తున్నట్టు టాలీవుడ్ సర్కిల్స్ లో వినిపిస్తున్న గాసిప్.

# ఫైనల్‌గా థియేట్రికల్ రిలీజ్‌కు..సిద్ధమైన మమిత



విష్ణు విశాల్, మమితా బైజు జంటగా నటిస్తున్న లేటెస్ట్ మూవీ 'ఇరందు వానం'. రామ్ కుమార్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రానికి సంబంధించిన రిలీజ్ డేట్‌పై గత కొద్ది రోజులుగా ఎన్నో ఊహాగాణాలు వినిపించగా.. తాజాగా అఫీషియల్ అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ మే-రకు ఇరందు వానం అక్టోబర్ 23న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతున్నట్లు తెలుపుతూ.. 'కేవలం వారి ప్రేమ, విధి మాత్రమే వారిని ఒకటి చేస్తాయి' అనే ఇంట్రెస్టింగ్ క్యాప్షన్‌తో షేర్ చేసిన ఈ అప్డేట్ పోస్టర్ ప్రజెంట్ నెట్టింట వైరల్ అవుతూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నది. 'ముండాసుప్టి', 'రాక్షసన్' లాంటి బ్లాక్ బస్టర్ చిత్రాల తర్వాత విష్ణు విశాల్, దర్శకుడు రామ్ కుమార్ కాంబినేషన్‌లో వస్తోన్న మూడవ చిత్రం కావడంతో.. 'ఇరందు వానం'పై కోలీవుడ్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి. అంతే కాకుండా.. ఇప్పటికే ఇందులో నుంచి వచ్చిన ప్రతి అప్డేట్ కూడా ప్రేక్షకులను ఎంతగానో ఆకట్టుకోగా.. ఇక రిలీజ్ డేట్ ప్రకటించడంతో త్వరలో ప్రమోషన్స్‌లో భాగంగా మరిన్ని అప్డేట్స్ పంచుకోనున్నారు మేకర్స్.

# సందీప్ కిషన్ పై ఫైర్..

తాజా చిత్రం 'సిగ్మా'. భారీ నిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్స్ నిర్మిస్తున్న ఈ రూటెడ్ హైస్ట్ యాక్షన్ అడ్వెంచర్ చిత్రంపై పరిశ్రమలో మంచి అంచనాలు ఉన్నాయి. కాగా, ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా ఫరియా అబ్దుల్లా పంచుకున్న పలు వ్యక్తిగత, వృత్తిపరమైన విశేషాలు ఇప్పుడు సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చకు దారితీస్తున్నాయి.ఇటీవల నిర్వహించిన ఓ కార్యక్రమంలో హీరో సందీప్ కిషన్.. ఫరియా ఎదుగుదల గురించి ప్రస్తావిస్తూ, ఆమె వరుస హిట్లు అందుకోవడమే కాకుండా హైదరాబాద్‌లో సొంతంగా ఇల్లు కూడా కొనుక్కొని స్థిరపడిందంటూ ఆమెను వెనకేసుకొచ్చి ప్రశంసలు కురిపించారు. అయితే దీనిపై తాజాగా స్పందించిన ఫరియా నవ్వులు పూయిస్తూ ఆ విషయాన్ని సున్నితంగా ఖండించారు.''సందీప్ కిషన్ ఇటీవల, ప్రెస్‌మీట్లో నా గురించి మాట్లాడుతూ కొన్ని విషయాలు సొంతంగా కల్పించి జోడించేశారు. నేను ఇప్పటికే సొంత ఇల్లు కొనుక్కున్నానంటూ ఆయన చెప్పిన దాంట్లో నిజం లేదు. నేనింకా సొంతంగా ఇల్లు కొనలేదు. కానీ సందీప్ అంత గట్టిగా చెప్పిన తర్వాతైనా... కనీసం ఇప్పుడైనా ఒక ఇల్లు కొంటే బాగుంటుందేమో అని నేనూ ఆలోచిస్తున్నా'' అంటూ తనదైన శైలిలో చమత్కరించారు.






# క్రేజీ ప్రాజెక్ట్ రీ - స్టార్ట్

మాలీవుడ్ దర్శకుల్లో థ్రిల్లర్ సినిమా అనగానే టక్కున గుర్తొచ్చే దర్శకుడు జీతూ జోసెఫ్. దృశ్యం సినిమాతో సౌత్‌లో మాత్రమే కాదు టోటల్ ఇండియాలోనే ఫేమస్ అయ్యాడు.. ఈ స్టార్ దర్శకుడు. కానీ మోహన్ లాల్‌ను దాటి వెళ్లలేకపోతున్నాడు. నేరు తర్వాత మూడు సినిమాలు తీస్తే.. రెండు బాక్సాఫీస్ దగ్గర బోల్తా పడ్డాయి. దృశ్యం3 మళ్లీ అతడ్ని లైమ్ లైట్‌లో నిలిచేలా చేసింది. దీంతో కంప్లీట్ స్టార్‌ను వదిలిపెట్టడం లేదు. ఈ ఇద్దరి కాంబోలో దృశ్యం4 ఉందా లేదా అన్నది ప్రస్తుతానికి డౌటే కానీ ఎప్పుడో ఎనౌన్స్ చేసిన ప్రాజెక్ట్ రామ్ సినిమాకు మోక్షం లభించింది.2020లో జీతూ- మోహన్ లాల్ రామ్ మూవీని ఎనౌన్స్ చేశారు. మొదట కరోనా వల్ల డిలే అయితే.. నిర్మాతలకు ఆర్థిక ఇబ్బందులు, నిధుల సమస్యల వల్ల ప్రాజెక్ట్ హోల్ట్ అవుతూ వచ్చింది. సమస్యలన్నీ సాల్వ్ కావడంతో ఆరేళ్ల తర్వాత తాజాగా రీస్టార్టైంది. త్రిష అండ్ సంయుక్త హీరోయిన్స్‌గా నటిస్తోన్న ఈ యాక్షన్ థ్రిల్లర్ టూ పార్ట్స్‌గా తెరకెక్కుతోంది. ఇందులో ప్రియమణి కీ రోల్ ప్లే చేస్తోంది. రీసెంట్లీ క్లాప్ బోర్డ్ పట్టుకున్న ఫోటోలను షేర్ చేసింది ప్రియమణి. స్టార్ హీరోలు ఒక్క సినిమా కంప్లీట్ చేసేందుకు ఏళ్లకు ఏళ్లు తీసుకుంటుంటే.. మోహన్ లాల్ మాత్రం చకా చకా సినిమాలు ఫినిష్ చేస్తూ.. థియేటర్స్‌లోకి తీసుకు వచ్చేస్తున్నాడు. ఇవి సరిపోవనట్లు క్యామియోలతో కూడా ఎంటర్టైన్ చేస్తున్నాడు లాలట్టన్. ఈ ఏడాది ఇప్పటికే ఆయన నుండి త్రీ మూవీస్ వచ్చాయి. ఇందులో దృశ్యం3 ఫుల్ ఫ్లెడ్జ్ మూవీ. మిగిలినవీ క్యామియోకి మించిన రోల్స్. ప్రస్తుతం ఆయన చేతిలో ఏడెనిమిది సినిమాలున్నాయి. ఆయన లైనప్, స్పీడ్ చూసైనా స్టార్ హీరోలు నేర్చుకుంటారేమో చూడాలి.

Edited, Printed, Published & Owned by **KOMARAJU SRINIVASULU** and Printed at **Ramu Graphics**, Shop No:5,Near Clock Tower Church Compound, Nalgonda District (T.S.), Published From: KOMARAJU SRINIVASULU, Village: Anthaiah Gudem, Post: Duppalapally, Mandal: Thipparthy-508247, Dist. Nalgonda, (T.S) **Editor: KOMARAJU SRINIVASULU. Cell: 7730032999, E-mail: flashindiadaily@gmail.com, www.flashindianews.com, RNI No. APTEL/2010/33229**